# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 09 సంచిక :239 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది:గురువారం 28-11-2024 పేజీలు:4 వెల: 2.00


## పెద్దపల్లిలో సీఎం విజయోత్సవ సభ..

హైదరాబాద్, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న సందర్భంగా డిసెంబర్ 4న పెద్దపల్లిలో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరై గ్రూప్ 4 తో పాటు వివిధ పరీక్షల్లో రిక్రూటైన 9 వేల మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తుండటంతో పెద్దపల్లిలో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అందుకు పెద్దపల్లి జిల్లా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి డిసెంబర్ 4న పెద్దపల్లి జిల్లాలో పర్యటిస్తారు. ఆ రోజు నిరుద్యోగ యువతితో భారీ బహిరంగ సభ నిర్వహించి ఇటీవల వివిధ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఉద్యోగాలకు ఎంపికైన 9 వేల మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. అందుకు భారీ బహిరంగ సభకు అనువైన స్థలాన్ని అధికారులు పరీశీలించారు. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా అధికారులతో కలిసి పెద్దకల్వల లోని సమీకృత జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని, పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్

## దిలావర్‌పూర్ గ్రామస్తులతో కలెక్టర్ చర్చలు



హైదరాబాద్ : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును రద్దు చేయాలని కోరుతూ రైతులు మహాధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. అయితే మహాధర్నాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు కొందరు రైతు ప్రతినిధులను అరెస్టు చేశారు. దీంతో ధర్నాలో అరెస్టు చేసిన ఆందోళనకారులను విడుదల చేయాలని కోరుతూ ఇవాళ రైతులు, మహిళలు పోలీసుస్టేషన్ నుంచి నిర్మల్– భైంసా రహదారి వైపు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దిగొచ్చింది. దిలావర్‌పూర్ రైతులతో కలెక్టర్ అభిలాష అభినవ్ చర్చలు జరిపారు. ఈ ఘటనపై ప్రభుత్వానికి నివేదిక పంపామని.. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లామని గ్రామస్తులకు తెలియజేశారు కలెక్టర్. ఈ నేపథ్యంలో ఇథనాల్ పరిశ్రమ పనులు నిలిపేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. అయితే కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా రైతులు, జనాలు ఇంకా ఆందోళన విరమించడం లేదు. ప్రభుత్వం లిఖిత పూర్వక హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని వారు డిమాండ్ చేస్తున్నారు. అంతకుముందు మహాధర్నాలో మహిళలు పురుగుల మందు డబ్బాలతో నిరసన తెలిపారు. జాతీయ రహదారిపై ఆందోళనకారుల బైఠాయించడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడే నిలిచిపోయింది. ఇథనాల్ పరిశ్రమ వల్ల తమ వ్యవసాయ భూములు పనికి రాకుండా పోతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

## అదానీ అంశంపై పార్లమెంట్‌లో రచ్చ



పార్లమెంట్ శీతాకాల సమావేశాలు రెండో రోజు ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు ఉభయసభలు సమావేశమయ్యాయి. అదానీ అంశంపై చర్చ చేపట్టాలంటూ విపక్షపార్టీలు డిమాండ్ చేశాయి. దీంతో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో సమావేశాలు ప్రారంభమైన కాసేపటికే ఉభయసభలు వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభం కాగానే అదానీ అంశంపై చర్చకు విపక్షాలు పట్టుబట్టాయి. కాంగ్రెస్ సహా ఇండియా కూటమి పార్టీల ఎంపీలు సభలో పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో గందరగోళ పరిస్థితి తలెత్తింది. దీంతో స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభ లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దీంతో చైర్మన్ ధన్‌ఖర్ సభను మధ్యాహ్నం 11:30కు వాయిదా వేశారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు నమోదు కావడం అటు రాజకీయ రంగంతోపాటు ఇటు వ్యాపార రంగంలోనూ తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. భారత్‌లో సోలార్ పవర్ ప్రాజెక్టులు దక్కించుకోవడానికి అదానీ గ్రూప్.. వివిధ రాష్ట్రాల్లోని ఉన్నతాధికారులకు 265 మిలియన్ డాలర్లు (రూ. 2,238 కోట్లు) లంచంగా ఇవ్వజూపినట్లు న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టులో అభియోగాలు నమోదయ్యాయి. ఈ వ్యవహారం ప్రస్తుతం రాజకీయ వర్గాలను కుదిపేస్తోంది. ఇక అదాని ఇష్యూపై పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చకు కాంగ్రెస్ పట్టుబడుతోంది. ఈ మేరకు కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్.. లోక్‌సభలో అదానీ లంచం ఆరోపణలపై జేపీసీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వాయిదా తీర్మానం ఇచ్చారు. కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాకూర్ సైతం గౌతమ్ అదానీపై చర్చకు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సభలో గందరగోళ పరిస్థితులు తలెత్తాయి.

## ప్రజలు తిరగబడతారని ప్రభుత్వ పెద్దల్లో వణుకు : ఎమ్మెల్సీ కవిత



తాము చేసిన తప్పులకు ప్రజలు తిరగబడతారని.. ప్రభుత్వ పెద్దల్లో వణుకు పడుతోందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. మాగునూరు జెడ్పీ హైస్కూల్‌లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తారని, ప్రజలతో కలిసి ఉద్యమిస్తారనే భయంతో తెల్లవారుజామునే అక్రమ అరెస్టులకు తెరలేపింది కాంగ్రెస్ సర్కార్ అంటూ ధ్వజమెత్తారు. ప్రజా పాలను అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పెద్దలు, ప్రజలు నిలదీస్తారనే భయంతో బీఆర్ఎస్ నేతలు, ప్రజలను నిర్బంధిస్తూ, తెలంగాణ ఉద్యమం నాటి సమైక్య రాష్ట్ర ప్రభుత్వ అణిచివేతలను తలపిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాం మోహన్ రెడ్డి, కార్యకర్తల ముందస్తు అరెస్టును తీవ్రంగా ఖండించారు. తెలంగాణ గడ్డ పోరాటాల పురిటిగడ్డ.. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా తిరుగుబాటులను అణిచివేయాలనుకోవడం మూర?త్వమన్నారు. మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫుడ్ పాయిజనింగ్ జరిగిన విషయం తెలిసిందే. దీంతో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో మక్తల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు ఆందోళన నిర్వహించే అవకాశం ఉందనే అనుమానంతో బుధవారం తెల్లవారు నుంచే పోలీసులు అరెస్టులకు దిగారు. అరెస్టు చేసిన నాయకులను జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. మాగనూరులో నిరసనలు, ఆందోళనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీఎస్పీ లింగయ్య నేతృత్వంలో భారీగా పోలీసులను మోహరించారు. చిట్టెం రామ్మోహన్ రెడ్డి అక్రమ అరెస్టు నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు మక్తల్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టగా.. వారిని పోలీసులు అరెస్టు చేశారు.

## ఎట్టకేలకు అదుపులోకి వచ్చిన మంటలు..!



జీడిమెట్ల ఎస్ఎస్‌వీ ఫ్యాబ్ ఇండస్ట్రీస్? పాలిథిన్ సంచుల తయారీ కంపెనీలో మంగళవారం భారీ ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. పరిశ్రమలో చెలరేగిన మంటలను అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి అర్ధరాత్రి వరకు అదుపులోకి తీసుకువచ్చారు. కంపెనీలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. భవనంలోని మూడో అంతస్తులో మంటలు చేరగా.. క్రమంగా ఒకటో అంతస్తు వరకు మంటలు అంటుకున్నాయి. ఆ తర్వాత భవనం మొత్తం మంటలు చెలరేగాయి. మంటల సమయంలో ఫ్యాక్టరీలోని కెమికల్ డ్రమ్ములు పెద్ద ఎత్తున నిల్వ ఉన్నట్లు సమాచారం. ఈ సమయంలో ఆ డమ్ములన్నీ పేలడంతో మంటలు మరింత చెలరేగాయి. ఫలితంగా మంటలను ఆర్పివేయడం అగ్నిమాపక సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. భారీగా చెలరేగిన మంటలతో ఆ ప్రాంతమంతా భారీగా పొగ కమ్మేసింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి నగరంలోని పలుచోట్ల నుంచి ఏడు ఫైరింజన్లను తరలించారు. అలాగే, వాటర్ బోర్డుతో పాటు ప్రైవేటు ట్యాంకర్లతో నీటిని తరలించారు. ఒక దశలో మంటలు వంద మీటర్ల ఎత్తు వరకు ఎగిసిపడ్డాయి. దాంతో పాటు 200 మీటర్ల వరకు వేడిసెగలు వచ్చాయి. రసాయన డ్రమ్ముల పేలుడుతో మంటలు భారీగా ఎగిసిపడగా.. మంటలను అదుపులోకి తేవడం అగ్నిమాపక సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. మంటల ధాటికి భవనం గోడలు బీటలు వారి కూలిపోయింది. ప్రమాదంలో దాదాపు రూ. 100కోట్లకుపైగా నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా. ప్రమాదం జరిగిన సమయంలో కంపెనీలు వంద మందికిపైగా కార్మికులు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం నేపథ్యంలో కార్మికులంతా బయటకు వెళ్లిపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది.

## బఫర్ జోన్‌లోనే హైడ్రా రంగనాథ్ ఇల్లు.. ఆధారాలున్నాయన్న కాంగ్రెస్ మాజీ నేత..!

హైదరాబాద్ : హైడ్రా కమిషనర్ రంగనాథ్ నివాసం పెద్ద చెరువు బఫర్ జోన్ పరిధిలోనే ఉన్నదని కాంగ్రెస్ మాజీ నేత బక్క జడ్సన్ ఆరోపించారు. రెండు నెలలు కష్టపడి వందేండ్ల నాటి మ్యాప్‌ను సంపాదించినట్టు పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలోనే యూసుఫ్‌గూడలోని పెద్ద చెరువు కృష్ణకాంత్ పార్క్‌గా మారిపోయిందని తెలిపారు. చెరువును పూడ్చివేసి పార్కు సమీపంలోనే కట్టమైసమ్మ గుడి కట్టారని చెప్పారు. మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టాలను హైడ్రా విస్మరించిందని విమర్శించారు. అసెంబ్లీలో చర్చ జరగకుండా గవర్నర్ ఆదేశాలతో హైడ్రాకు అధికారాలు కట్టబెడితే అవి చెల్లవని పేర్కొన్నారు. 40 ఏండ్ల నుంచి మధురానగర్‌లో ఉంటున్న రంగనాథ్.. అక్కడ చెరువు ఉండేదన్న విషయాన్ని ఇప్పటివరకు ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. ఆ చెరువు హెచ్ఎండీఏ పొందుపరిచిన చెరువుల జాబితాలో ఎందు కు లేదని నిలదీశారు. చెరువు నుంచి కిలోమీటర్ దూరంలో తన ఇల్లు ఉన్నదని చెప్తున్న రం గనాథ్%%% 500 మీటర్ల లోపల ఉన్న ఇండ్ల కు ఎందుకు నోటీసులు ఇవ్వలేదని ప్రశ్నించారు. వందేండ్ల నాటి మ్యాప్ ఆధారంగా వెంగళరావునగర్‌లో రంగనాథ్ నివాసం ఉం టున్న ఇ ల్లు, పెద్ద చెరువు బఫర్‌జోన్ పరిధిలోకి వస్తుందని వివరించారు.

## ఆ జిల్లా కలెక్టర్‌పై కేటీఆర్ తిట్ల పురాణం



హైదరాబాద్,బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి అధికారుల మీద నోరు పారేసుకున్నారు. ఈసారి ఏకంగా ఓ ఐఏఎస్‌ను టార్గెట్ చేస్తూ ఇష్టారీతిన వ్యాఖ్యలు చేశారు. బ్యూరోక్రాట్ అని కూడా వదలకుండా తిట్ల పురాణం అందుకున్నారు. ఆ కలెక్టర్‌తోపాటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలువురు అధికారులు, పోలీసులకు కూడా వార్నింగ్ ఇచ్చారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన కేటీఆర్ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నాయకులను కలెక్టర్ పార్టీ మారాలని చెబుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఆయనో సన్నాసి అంటూ తిట్ల దండకం అందుకున్నారు. 'ఓ కాంగ్రెస్ కార్యకర్త వచ్చి కలెక్టర్ సీట్లో కూర్చున్నడు. గిసొంటి సన్నాసులను తీసుకొచ్చి కక్షపూరితంగా రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నరు. అయినా ఏం ఫరక్ పడది. బీఆర్ఎస్ వెంట్రుక కూడా పీకలేదు' అంటూ కలెక్టర్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఆయన మన నాయకులను పార్టీ మారాలంటూ సీదా చెప్తుండంట. గంత గొప్పోడున్నడు ఇక్కడి కలెక్టర్. ఎన్ని రోజులు ఈ కలెక్టర్లు, పోలీసులు, అధికారుల నాటకాలు ఆడుతారు. మనం కూడా చూద్దాం. నేను అంత మంచోన్నేం కాదు. ఎవరెవరైతే అతి చేస్తున్నరో, కాంగ్రెస్ కార్యకర్తల్లాగా పనిచేస్తున్నరో వారికి వడ్డీతో సహా ఇస్త. రేవంత్ రెడ్డి కాదు, ఆయన తాత వచ్చినా, జేజమ్మ వచ్చినా సిరిసిల్లలో వెంట్రుక కూడా పీకలేరు' అంటూ మాట్లాడుకొ చ్చారు. ఇక ఇదే సమయంలో రేవంత్ రెడ్డి, బండి సంజయ్‌పైనా ఫైర్ అయ్యారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఆర్ఎస్ బ్రదర్స్‌లా ఉంటున్నారని విమర్శించారు. బీజేపీ నాయకత్వం రేవంత్ ప్రభుత్వానికి రక్షణ కవచంలా ఉందని, ఆయన మీద ఈగ వాలనీయకుండా కంటికి రెప్పలాగా సంజయ్ కాపాడుకొస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి అభిమానుల సంఘం అధ్యక్షుడు ఎవరని అడిగితే బండి సంజయ్ అని ఎద్దేవా చేశారు. కేటీఆర్ ఒక్కసారిగా అధికారులపై రెచ్చిపోవడంతో ఆయన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. ముఖ్యంగా అధికార యంత్రాంగంలో మరింత కోపాన్ని రగిల్చాయి.

## ప్లాన్-బీని సిద్ధం చేసిన షిండే వర్గం..!



మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నది ఇంకా తేలలేదు. నాలుగు రోజులుగా ఈ అంశంపై తీవ్రంగా చర్చ నడుస్తోంది. గత శాసనసభ గడువు మంగళవారంతో ముగిసినప్పటికీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై మహారాష్ట్రలో ఇంకా స్పష్టత రాలేదు. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టాలన్నదానిపై సందిగ్ధత కొనసాగుతోంది. ఓవైపు బీజేపీ అత్యధిక సీట్లు గెలుచుకున్న నేపథ్యంలో తమ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్‌కుముఖ్యమంత్రి పదవిని అప్పగించాలని ఆ పార్టీ నేతలు కోరుతున్నారు. మరోవైపు.. షిండే నాయకత్వంలోనే ఈ ఎన్నికల్లో తమ కూటమి గెలుపొందినందున ఏక్‌నాథ్ షిండే నే ముఖ్యమంత్రిగా కొనసాగించాలని శివసేన కార్యకర్తలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఆసక్తికర విషయం ఒకటి ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. సీఎం పదవి దక్కని పక్షంలో షిండే వర్గం ప్లాబ్-బీని సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ఏక్‌నాథ్ షిండేని ముఖ్యమంత్రిని చేయకపోతే.. హోంశాఖ ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేసినట్లు సమాచారం. మంగళవారం అర్ధరాత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో షిండే వర్గం నేతలు జరిపిన సమావేశంలో ఈ డిమాండ్‌ను ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ మేరకు సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. దీంతోపాటు మరికొన్ని వార్తలు కూడా ప్రచారంలో ఉన్నాయి.

షిండేకు కేంద్రమంత్రి పదవి?

రెండు రోజుల క్రితం దేవేంద్ర ఫడ్నవీస్‌కు జాతీయ స్థాయిలో కీలక పదవి వస్తుందని ప్రచారం జరిగింది. తాజాగా మరో అప్‌డేట్ బయటకు వచ్చింది. ఫడ్నవీస్‌ను ముఖ్యమంత్రిని చేసి ఏక్‌నాథ్ షిండేను కేంద్రమంత్రిగా, ఆయన కుమారుడు శ్రీకాంత్ షిండేను మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా చేస్తారని ప్రచారం జరుగుతున్నది. మరొక ఉప ముఖ్యమంత్రిగా అజిత్ పవార్‌ను ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ ఫార్ములా ద్వారా మూడు పార్టీలనూ ఆకర్షించేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని అంటున్నారు. ఇది షిండే గౌరవాన్ని తక్కువ చేయదని, ఈ విషయం తేలికగా పరిష్కారమవుతుందని బీజేపీ భావిస్తున్నది. అయితే షిండే ముఖ్యమంత్రి కావాలని శివసేన నేతలు గట్టిగా ఒత్తిడి తెస్తున్నారని కూడా చెబుతున్నారు. కాగా, ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు గానూ.. బీజేపీకి 132, శివసేనకు 57, ఎన్సీపీకి 41 స్థానాలు లభించాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర కొత్త ప్రభుత్వం ఏర్పడటానికి మార్గం సుగమం చేస్తూ ముఖ్యమంత్రి పదవికి ఏక్‌నాథ్ షిండే మంగళవారం రాజీనామా చేశారు. కొత్త ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టేవం కూ ఆపద్ధర్మంగా కొనసాగాలని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ షిండేను కోరారు.

## పింఛన్ల కోసం కోసం వృద్ధులు రోడ్డెక్కుతారని ఎవరు అనుకున్నారు?



సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ఏలుబడిలో వృద్ధులు పింఛన్ల కోసం పడిగాపులు పడుతున్నారు. నెలానెలా సరైన సమయంలో పింఛన్లు ఇవ్వకపోవడంతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో నిత్యం ఎక్కడో చోట పింఛన్ల కోసం రోడ్డెక్కుతున్నారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో పింఛన్ వృద్ధులు రోడ్డెక్కారు. వెంటనే పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో నెలనెలా సక్రమంగా పింఛన్ వచ్చేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చినంక పింఛన్ డబ్బుల కోసం ఎదురుచూడాల్సి వస్తుందని వాపోయారు. 18 నుంచి 20వ తేదీలోగా పోస్టాఫీసుల్లో ఇచ్చేవారని.. నవంబర్ 25వ తేదీ వచ్చినా ఇంకా డబ్బులు ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండురోజుల్లోనే వచ్చేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వృద్ధులు శాంతించారు. వృద్ధుల ఆందోళనపై 'నమస్తే'లో ప్రచురితమైన కథనంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు స్పందించారు. తెలంగాణాలో పింఛన్ల కోసం కోసం వృద్ధులు రోడ్డెక్కుతారని ఎవరు అనుకున్నారు.. టంచన్‌గా అకౌంట్లో పడే పడే పైసలు ఆగిపోతాయని ఎవరునుకున్నారు? అన్నారు. మూసీ బ్యూటిఫికేషన్ కోసం లాక్షా యాభై వేల కోట్లు వెదజల్లి.. కనికరం లేకుండా వృద్ధుల పెన్షన్ డబ్బులను ఆపుతారని అనుకున్నారన్నారు. మందుబిల్లల కోసం కొడుకులు, కోడళ్ల దగ్గర చేయిచాచే అవసరమే లేని రోజుల నుంచి మళ్లీ వేడుకునే 'మార్పు' వస్తుందని ఎవరు ఊహించారని.. అణువణువునా కర్కశత్వాన్ని నింపుకున్న ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా ఇక్కట్లే ఉంటాయని ఎవరనుకున్నారు..? మార్పు ఇంత మోసగిస్తుందని ఎవరనుకున్నారు? అంటూ 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు.

## రాజధానిని కమ్మేసిన పొగమంచు



దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్య తీవ్రత కొద్దిమేర తగ్గింది. ఇటీవలే కాలంలో ఢిల్లీ %-% ఎన్సీఆర్ ప్రాంతంలో ఏక్యూఐ లెవల్స్ 400కి పైనే నమోదైన విషయం తెలిసిందే. తాజాగా గాలి నాణ్యత సూచీ 300 నుంచి 400 మధ్యే నమోదవుతోంది. అయినప్పటికీ తీవ్రమైన కేటగిరీలోనే ఉంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. బుధవారం ఉదయం 7 గంటలకు ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 301గా రికార్డైంది. %లోధి రోడ్‌లో 254, ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 3 వద్ద 298, ఓఖ్లా ఫేజ్‌లో 298, డీటీయూలో 250, పూసాలో 281గా నాలి నాణ్యత సూచీ నమోదైంది. కొన్ని స్టేషన్లలో ఏక్యూఐ లెవల్స్ తీవ్రమైన విభాగంలో నమోదయ్యాయి. అశోక్ విహార్‌లో 316, ఆనంద్ విహార్‌లో 311, ఐటీవో ప్రాంతంలో 316, వజీర్‌పూర్‌లో 331, వివేక్ విహార్‌లో 318, షాదీపూర్‌లో 375గా గాలి నాణ్యత సూచీ నమోదైంది. గాలి కాలుష్యానికి తోడు నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు.

## సంపాదకీయం

గురువారం 28-11-2024

## హెచ్చరిక.. మార్గదర్శనం..

మహారాష్ట్ర, జార?ండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అధికార కూటములు గెలుపొందాయి. మహారాష్ట్రలో బిజెపి, ఏక్‌నాథ్ షిండేకు చెందిన శివసేన, అజిత్ పవార్‌కు సంబంధించిన ఎన్‌సిపి మహాయుతి ఫ్రంట్ సాధించిన అనూహ్య విజయం ఆశ్చర్యపరుస్తుంది. 288 స్థానాలున్న మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన సాధారణ మెజార్టీ 145 స్థానాలు కాగా మహాయుతికి 234 స్థానాలొచ్చాయి. కాంగ్రెస్, ఉద్ధవ్ థాకరేకు చెందిన శివసేన, శరద్ పవార్‌కు సంబంధించిన ఎన్‌సిపి ఫ్రంట్ మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ)కి 48 సీట్లే దక్కాయి. అంచనాలకు మించి ఓట్లు, సీట్లు రావడానికి బిజెపి సహజసిద్ధంగా ప్రయోగించిన హిందుత్వ కార్డు, అస్తిత్వ రాజకీయాలు ప్రధాన కారణం. కుల, మత, ప్రాంతీయ భావాలను తనకు అనుకూలంగా మరల్చుకోవడంలో, ఓట్లను సమీకరించడంలో సక్సెస్ అయిందని ఎన్నికల ఫలితాలను చూస్తే అర్థమవుతుంది. మరాఠా కోటాను తానే తెరమీదకు తెచ్చి, నిరసనగా ఆందోళనలు చేస్తున్న తరగతులను సైతం తన వైపు తిప్పుకుంది. ఉచిత పథకాలొద్దని విపక్షాలకు సుద్దులు వల్లించే బిజెపి, అధికారం కోసం పలు సంక్షేమ పథకాలను ప్రకటించింది. గిరిజన రాష్ట్రం జార?ండ్‌లో జెఎంఎం నేతృత్వంలోని కూటమి ఘన విజయం బిజెపికి మింగుడు పడని వ్యవహారం. రాష్ట్రంలో 81 స్థానాలకుగాను జెఎంఎం ఫ్రంట్ 56 సీట్లు గెలుపొందింది. బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎకి కేవలం 24 సీట్లొచ్చాయి. అవినీతి ఆరోపణల కేసులో జెఎంఎం చీఫ్, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కేంద్ర బిజెపి సర్కార్ జైలులో పెట్టించింది. సార్వత్రిక ఎన్నికలకు బయటికి రానీయలేదు. బెయిల్ రాకుండా అడ్డుకుంది. సుప్రీం కోర్టు ఆదేశాలతో మాత్రమే హేమంత్‌కు బెయిల్ లభించింది. హేమంత్ జైలులో ఉండగా కొన్నాళ్లు సిఎంగా పని చేసిన ఆయన సోదరుడు చెంపయి సోరెన్‌ను బిజెపి తమలో చేర్చుకున్నా, ప్రధాని మోడీ, ఇతర బిజెపి పెద్దలు హేమంత్ అవినీతి పరుడంటూ పెడబొబ్బలు పెట్టినా, మత విద్వేషాలు, ఎస్‌టి, నాన్-ఎస్‌టి విద్వేషాలు రెచ్చగొట్టినా ఆ కుట్రలను పటాపంచలు చేసి జెఎంఎం ఫ్రంట్‌కు ప్రజలు ఘన విజయం అందించారు. హేమంత్‌పై బిజెపి చర్యలన్నీ రాజకీయ కక్షతో కూడుకున్నవని గ్రహించి జెఎంఎం ఫ్రంట్‌కు రెండోసారి పట్టం కట్టి తమ విశ్వాసాన్ని చాటుకున్నారు. హేమంత్ సారథ్యంలోని ప్రభుత్వమే తమ హక్కులను పరిరక్షిస్తుందని ఆదివాసీలు, ఇతరులు సైతం నమ్మారు. జెఎంఎం కూటమి విజయానికి అది ప్రకటించిన, ఇంతకు ముందు అమలు చేసిన సంక్షేమ పథకాలూ కారణమే. మహారాష్ట్ర, జార?ండ్ ఎన్నికల ఫలితాలు పలు హెచ్చరికలతో పాటు మార్గదర్శనమూ కావిస్తున్నాయి. ప్రపంచ ద్రవ్య పెట్టుబడికి, నయా-ఉదారవాద విధానాలకు దేశానికి మహారాష్ట్ర ముఖద్వారం. ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయం నాగ్‌పూర్ ఈ రాష్ట్రంలోనిదే. అందుకే మహారాష్ట్ర చేజారి పోకుండా ఎన్నికల ప్రకటనలో జాప్యం సహా అన్ని పాచికలనూ బిజెపి వాడింది. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించిన విపక్ష ఎంవిఎ చివరి వరకు ఓవర్ కాన్ఫిడెన్స్‌లో ఉంది. సీట్ల సర్దుబాట్లలో అసంతృప్తులు, పార్టీల ఆధిపత్య ధోరణి ఎంవిఎను ఘోరంగా దెబ్బతీసింది. జార?ండ్‌లో బిజెపి కుయుక్తులను జెఎంఎం కూటమి సమర్థవంతంగా ఎదుర్కొని విజయ తీరాలకు చేరింది. మహారాష్ట్రలో మోడీ చరిష్మా పని చేసిందని ఊరేగుతున్న బిజెపికి జార?ండ్‌లో అదేమైందో విశదీకరిస్తే బాగుంటుంది. అటవీ రాష్ట్రమైన జార?ండ్‌లో సహజ వనరులను అదానీ, ఇతర కార్పొరేట్లకు ధారాదత్తం చేయాలన్న బిజెపి పన్నాగం పారలేదు. వయనాడ్‌లో ప్రియాంక గెలుపు ఊహించినదే. దేశ వ్యాప్తంగా ఉప ఎన్నికలు జరిగిన 46 అసెంబ్లీ స్థానాల్లో అత్యధికంగా అధికార కూటములు, పార్టీలు నెగ్గాయి. మహారాష్ట్రలో దహాను స్థానంలో సిపిఎం జయకేతనం వామపక్ష, ఆదివాసీ హక్కులు, కార్మిక, ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తినిస్తుంది. సార్వత్రిక ఎన్నికల్లో స్వంతంగా మెజార్టీ కోల్పోయి కేంద్రంలో సంకీర్ణ సర్కారు నడుపుతున్న బిజెపికి హర్యానా, మహారాష్ట్ర గెలుపులు ఊతమిస్తున్నాయి. మతతత్వ-కార్పొరేట్ విధానాలను మరింత ముందుకు తీసికెళ్లేందుకు బిజెపి ప్రయత్నిస్తుంది. ప్రజలు అప్రమత్తతతో మెలగాలి.

# ఈ 'మహా' ప్రభంజనానికి కారణాలు..



ముంబై:మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి (బీజేపీ, షిండే శివసేన, అజిత్ పవర్ నేషనలిస్టు పార్టీ) విజయం సాధిస్తుందని ఎన్నికల సర్వేలు చెప్పినప్పటికీ సీట్ల విషయంలో చాలా తేడా ఉంది. 288 సీట్లకు మహా యుతి కూటమి అనూహ్యంగా 234 సీట్లు సాధించడం దేశంలోని రాజకీయ విశ్లేషకులను సంభ్రమాశ్చర్యాలు గురిచేసిందంటే అతిశయోక్తి కాదేమో!దేశ ఆర్థిక రాజధాని రాష్టంగా పిలువబడుతున్న మహారాష్ట్రలో జాతీయవాదులు అనూహ్య విజయం సాధించడం, ఈ విజయం వెనుక రాష్ట్రీయ స్వయం సేవక సంఘం కృషి ఉండడం దేశంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

మహాయుతి ప్రభంజనం

15 రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో 48 సీట్లకు 28 సీట్లు ఎన్డీయే కూటమి సాధించడం గొప్ప విషయం ఏమి కాదు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో ఇచ్చిన ఉచిత గ్యారెంటీల హామీలతో కాంగ్రెస్ పార్టీ ఉద్ధవ్ థాకరే, శివసేన, శరద్ పవర్ నేషనలిస్ట్ పార్టీలతో జతకట్టి మహా వికాస్ అఘాడి కూటమి పేరుతో ఎన్నికల్లో పోటీ చేసి కేవలం 48 సీట్లతో సరిపెట్టుకోవలసి వచ్చింది. ఇక ఉపఎన్నిక జరిగిన రెండు పార్లమెంట్ సీట్లలో కాంగ్రెస్ విజయం సాధించడం ఆ పార్టీకి కొంత ఊరట నిచ్చే విషయమే!

ఆ ఒక్క నిర్ణయమే దెబ్బతీసిందా?

మేలో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో 48 లోక్ సభ సీట్లకు 30 సీట్లు సాధించిన ఈ కూటమి అసెంబ్లీ ఎన్నికల్లో ఇంత ఘోరంగా వెనుకబడిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. అందులో మొదటి కారణం ఆల్ ఇండియా ముస్లిం ఉలేమా బోర్డు కోరిన 17 డిమాండ్లకు కాంగ్రెస్ ఆధ్వర్యంలోని కూటమి నాయకులు అంగీకరించడం. ఈ విషయాన్ని హిందుత్వ సంస్థల కార్యకర్తలు హిందూ ఓటర్ల దగ్గరికి సానుకూలంగా తీసుకెళ్లడం మరొక కారణం. ఈ విషయంలో హిందుత్వం పట్ల ఆధారాభిమానం ఉండే ఓటర్లు ఓటింగ్ రోజు ఓటింగ్ కేంద్రాలకు వచ్చి బీజేపీ కూటమికి అనుకూలంగా ఓటును వేశారు. ఈ హిందూ అనుకూల ఓటర్ల సహాయంతోని షిండే శివసేన 57 సీట్లు, అజిత్ పవార్ నేషనలిస్టు పార్టీ 41 సీట్లు సునాయాసంగా సాధించాయని చెప్పడంలో ఎటువంటి అనుమానం లేదు.

ఓబీసీ కార్డు పని చేయకున్నా...

ఇక ఓబిసి కుల సమీకరణ ఈ ఎన్నికల్లో బీజేపీకి పని చేయలేదు. అది పని చేసి ఉంటే-నాందేడ్ లోక్‌సభ స్థానాన్ని బీజేపీ ఉప ఎన్నికల్లో గెలిచేది. ఇక షిండే ప్రభుత్వం అమలు చేసిన 'లడికి బెహన్ యోజన' పథకం మహిళా ఓటర్లను బీజేపీ కూటమి వైపునకు మ ళ్లించిందనేది వాస్తవమే. ఎన్నికల ముందు రెండు లక్షల 34 వేల మంది మహిళలకు నెలకు 1500 రూపాయలు చొప్పున ఆర్థిక సహకారం అందింది. 'ఏక్ హై తో సేఫ్ హై' ప్రధాని మోడీ ఇచ్చిన నినాదం ఓటర్ల మీద కొంత వరకు పనిచేసిందని చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మహారాష్ట్రలోని అనేక నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తూ, బీజేపీ మతతత్వ పార్టీ కాదు మానవత్వ పార్టీ అని ఇచ్చిన నినాదం ఆ నియోజకవర్గాల ఓటర్ల పైన బాగా ప్రభావం చూపింది. 2014లో 122 సీట్లు, 2019లో 105 సీట్లు గెలుచుకున్న బీజేపీ ఈసారి ఏకంగా 132 సీట్లు గెలుచుకోవడం అనూహ్య విజయం.

ఫలించని కమల వ్యూహం!

ఇక ఝార?ండ్ ఎన్నికల ఫలితాలు ముందు ఊహించినవే. కాంగ్రెస్‌తో జతకట్టిన జేఎంఎం కూటమి 81 సీట్లకు 56 సీట్లు సాధించడం వెనుక మావోయిస్టులు, మిషనరీలు, ఇస్లాం గ్రూపులు బలంగా పనిచేశాయనేది అక్షర సత్యం. ఆ రాష్టంలో అక్రమ చొరబాట్ల సమస్య తీవ్రంగా ఉందని, రాష్ట్ర హైకోర్టు దీనిపై ఎంక్వయిరీ చేయాలని అక్కడి రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు ఇచ్చినప్పటికీ ,అక్రమ చొరబాటుదారుల ఓట్లతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకునే జేఎంఎం, కాంగ్రెస్, కమ్యూ నిస్టు, ఆర్జేడీ పార్టీల నాయకుల ఆశలు ఈ ఎన్నికల్లో నెరవేరాయి. ఇక తాము అధికారంలోకి వస్తే, అక్రమ చొరబాటుదారులను ఏరిపారేస్తామని, ఎన్ఆర్‌సీని అమలు చేస్తామని బీజేపీ నాయకులు చెప్పిన మాటల్ని, అక్రమ చొరబాటుదారుల వల్ల భవిష్యత్తులో భారత దేశానికి భద్రత పరంగా ఎదురయ్యే సమస్యలను కొండ జాతి ప్రజలు సరిగా అర్థం చేసుకోలేదని ఈ ఎన్నికల ఫలితాలు తెలియజేస్తున్నాయి. అయినప్పటికీ బీజేపీ 21 సీట్లతో 33.17% ఓట్లను పొందింది. 23.17శాతం ఓట్లతో జేఎంఎం 34 సీట్లు సాధించడం ఆశ్చర్యం కలిగించినా బీజేపీ జాతీయవాదాన్ని వ్యతిరేకించే ఓటును జేఎంఎం కాంగ్రెస్ కూటమి బాగా ఒడిసి పట్టిందని ఈ ఫలితాలు తెలియజేస్తున్నాయి. వాస్తవంగా హేమంత్ సోరేన్ ప్రభుత్వం అవినీతితో కూడుకున్నదే. ట్రైబల్ ప్రజలకు అవినీతి విషయంలో అంత పట్టింపు ఉండదు. జేఎంఎం కూటమి ప్రభుత్వం. 'మెయ్యా యోజన పథకం' ద్వారా ప్రతి మహిళకు నెలకు 1000 రూపాయల ఆర్థిక సహకారం అందించడం, కూటమి మల్లా గెలిస్తే, దీనిని 2500 కు పెంచుతామని ఇచ్చిన హామీ ట్రైబల్ ఓటర్ల మనసుల మీద బాగా పనిచేసింది.

కులగణన తుస్సుమన్నట్లేనా?

ఇక చివరగా దేశ ఆర్థిక రాజధాని రాష్టంగా పిలువ బడుతున్న మహారాష్ట్రలో జాతీయవాదులు అనూహ్య విజయం సాధించడం, ఈ విజయం వెనుక రాష్ట్రీయ స్వయంసేవక సంఘం కృషి ఉండడం దేశంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. పైగా కుల గణన వల్ల దేశంలో సామాజిక మార్పు వస్తుందని కాంగ్రెస్ నాయకులు చెప్పిన మాటలను మహారాష్ట్ర ఓటర్లు తృణీకరించినట్లు ఎన్నికల ఫలితాలు తెలియజేస్తున్నాయి. 15 రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో 48 సీట్లకు 28 సీట్లు ఎన్డీయే కూటమి సాధించడం గొప్ప విషయమే. ఇక ఉపఎన్నిక జరిగిన రెండు పార్లమెంటు సీట్లలో కాంగ్రెస్ విజయం సాధించడం ఆ పార్టీకి కొంత ఊరట నిచ్చే విషయమే!

## రామగుండంలో రూ. కోటి 30 లక్షల గంజాయి దహనం

రామగుండం, పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో పట్టుబడ్డ రూ.కోటి 30 లక్షల విలువగల గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో మానకొండూరు వద్ద పోలీసులు దహనం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ 2021 నుంచి వివిధ పోలీసు స్టేషన్‌లలో నమోదైన 64 కేసుల్లో నిందితుల నుంచి 521.544 కిలోల ప్రభుత్వ నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఎన్‌డీపీఎస్ చట్ట ప్రకారం కోర్టు అనుమతి తీసుకుని, న్యాయాధిపతుల ముందు కేసు ప్రాపర్టీని ఎఫ్‌ఎస్ఎల్ కోసం శాంపిల్ తీసి మిగిలిన మొత్తాన్ని వెంకటరమణ ఇన్సినేటర్ ఫ్యాక్టరీ వద్ద పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ దహనం చేశామన్నారు. దహనం చేసిన నిషేధిత గంజాయి విలువ సుమారు రూ. 1,30,38,600 వివరించారు. అక్రమార్జనలో భాగంగా గంజాయి సాగు, విక్రయిస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురి చేస్తూ మత్తులోకి దించుతున్నారన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిని అరికట్టడం కోసం స్థానిక, స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసుల ద్వారా విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఎవరైనా గంజాయి , ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మొక్కుబడిగా 'కాప్' సదస్సులు

సెంట్రల్ డెస్క్:ప్రపంచం మొత్తం మీద అసాధారణ వాతావరణ పరిణామాలకు తోడు ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధం ఫలితంగా తలెత్తిన ఇంధన సంక్షోభం, బొగ్గుపులుసు వాయువుల వెల్లువను తగినంతగా ప్రపంచ దేశాలు కట్టడి చేయలేకపోతున్నాయి. భవిష్యత్తులో భూగోళాన్ని ఎలా పరిరక్షించుకోవాలన్న ప్రధాన అంశాలు చర్చించేందుకు ఏటా ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వాతావరణ 'కాప్' సదస్సులు మొక్కుబడిగా సాగుతున్నాయి తప్ప అనుకున్న లక్షాలను సాధించడం లేదు. వాతావరణ మార్పులను నివారించడానికి ఎలాంటి ప్రణాళికలు చేపట్టాల్సి ఉంటుందో సదస్సులోని సభ్యదేశాలు తప్పనిసరిగా చర్చించవలసి ఉంటుంది.ఆ మేరకు తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉన్నా అగ్రదేశాలు ఈ విషయంలో అంటీఅంటనట్టు వ్యవహరిస్తున్నాయి. ఇప్పుడు కాప్ 29 సదస్సులో కూడా అగ్రదేశాలు నిధుల కేటాయింపు విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడం స్పష్టమైంది. అజర్‌బైజాన్ రాజధాని బాకు వేదికగా ఐక్యరాజ్యసమితి కాప్ 29 పర్యావరణ సదస్సులో దాదాపు (నవంబర్ 11 నుంచి 24 వరకు) 14 రోజుల పాటు సాగిన చర్చలు అనుకున్న లక్షాల సాధన విషయంలో అసంతృప్తినే మిగిల్చాయి. వాతావరణంలో ప్రతికూల మార్పులపై పోరాడేందుకు వర్ధమాన దేశాలకు ధనిక దేశాలు అందజేయాల్సిన ఆర్థిక సాయం 300 బిలియన్ డాలర్లుగా నిర్ణయించారు. పదేళ్లపాటు ప్రతి సంవత్సరం 300 బిలియన్ డాలర్లు అభివృద్ధి చెందుతున్న దేశాలకు సంపన్న దేశాలు నిధులు సమకూర్చాలని కాప్29 సదస్సు చేసిన తీర్మానంపై భారత్‌తో సహా వర్ధమాన దేశాలన్నీ అసంతృప్తి వ్యక్తం చేశాయి.ఏటా 300 బిలియన్ డాలర్లు చాలవని, కనీసం 1.3 ట్రిలియన్ డాలర్లయినా ఇవ్వాలని వాదించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఏటా ఎదుర్కొంటున్న వాతావరణ బీభత్సం, ఇతర సమస్యల సవాళ్లతో పోలిస్తే 2035 వరకు ఏటా కేటాయించే ఈ 300 బిలియన్ డాలర్ల మొత్తం చాలా అల్పమైనదని భారత్ విమర్శించింది. అయితే అగ్రరాజ్యం అమెరికా మాత్రం 300 బిలియన్ డాలర్ల వాతావరణ నిధి తీర్మానం ఎంతో గొప్పగా ఉందని ప్రశంసించింది. 2015లో ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో కాప్ సదస్సులో ఆమోదించిన 1.5 డిగ్రీల సెల్సియస్ స్థాయికి ప్రపంచ ఉష్ణోగ్రతలను తగ్గించే లక్షం ఈనాటికీ సాంకేతికంగా చూసినప్పుడు సాధ్యమేనని, ఐతే రాబోయే పదేళ్లలో మాత్రం వాతావరణంలో కలుషిత వాయువులను గణనీయంగా తగ్గించుకోవలసిన అవసరం ఉందని ఐక్యరాజ్యసమితి సూచించింది. ఆనాడు పారిస్ ఒప్పందంపై 200 దేశాలు సంతకాలు చేశాయి.పరిస్థితులు ఇలాగే ఉంటే ఈ శతాబ్దాంతానికి వాతావరణంలో ఉష్ణోగ్రతలు మూడు డిగ్రీల సెల్సియస్‌కు పెరుగుతాయని తాజా అంచనాలు చెబుతున్నాయి. 2023లో 57.1 గిగా టన్నుల కార్బన్‌డైయాక్సైడ్ వాయువుల వరకు ప్రపంచ ఉద్గారాలు రికార్డు స్థాయిలో చేరుకున్నాయి. ఇవి 2022 నాటికన్నా 1.3 శాతం ఎక్కువ. వీటిలో 77% జి20 దేశాల నుంచే వెలువడుతున్నాయి. ఈ ఉద్గారాలను తక్షణం నిరోధించలేకుంటే 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్ సెల్సియస్ వరకు భూతాపాన్ని అదుపు చేయాలన్న పారిస్ సదస్సు



ఒప్పంద లక్షం కొన్నేళ్లలోనే కనుమరుగైపోయే ప్రమాదం ఉంటుంది. వాతావరణ మార్పుల కట్టడికి కట్టుబడి ఉండటం ఎంతో వ్యయంతో కూడుకున్న లక్షం.అందుకు వర్ధమాన దేశాలకు ఏటా 100 బిలియన్ డాలర్ల వరకు ఆర్థిక సాయాన్ని అందిస్తామని అభివృద్ధి చెందిన దేశాలు 2009 కొపెన్‌హెగెన్ వాతావరణ సదస్సులో ప్రతిజ్ఞ చేసినా, అది ఇంతవరకు సరిగ్గా అమలు కాలేదు. అలాగే కాప్ 26 సదస్సులో శిలాజ ఇంధనాల వినియోగాన్ని విడిచిపెట్టాలన్న ప్రతిపాదనపై భిన్నాభిప్రాయాలు వెలువడ్డాయి. ఈ నిర్ణయాన్ని కొంతవరకు పట్టించుకోకుండా పక్కన పెడితే బాగుంటుందని సౌదీఅరేబియా, జపాన్, ఆస్ట్రేలియా వంటి దేశాలు ఐక్యరాజ్యసమితిని పరోక్షంగా అభ్యర్థించాయి. ఈ సమస్యను నీరు గార్చాలని కోరుతూ ప్రభుత్వాల నుంచి, కంపెనీల నుంచి, మరికొన్ని సంస్థల నుంచి దాదాపు 3200 అభ్యర్థనలు వచ్చాయి. మొత్తం మీద శిలాజ ఇంధనాల వినియోగాన్ని అంత తొందరగా తగ్గించవలసిన అవసరం లేదన్న అభిప్రాయంలో అమెరికా తదితర అగ్రదేశాలు ఉన్నాయి. బొగ్గు వినియోగాన్ని బాగా తగ్గించాలన్నదే కాప్ సదస్సుల ప్రధాన అజెండా అయినప్పటికీ ఆ మేరకు బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాలను మూసివేయడానికి ఆస్ట్రేలియా తదితర దేశాలు ముందుకు రావడం లేదు.బొగ్గు నుంచి వెలువడే వాయువులను శూన్యస్థాయికి తీసుకురావాలన్న ప్రతిపాదనకు అగ్రదేశాలు మొగ్గు చూపడం లేదు. 2030 నాటికి అడవుల నిర్మూలనను పూర్తిగా అరికడతామని ఆస్ట్రేలియాతోపాటు మరో 123 దేశాలు కాప్ 26 సదస్సులో ప్రమాణ పత్రం పై సంతకాలు చేశాయి. అంతకన్నా ముందు కూడా ఇలాంటి ఒప్పందాలు అనేకం జరిగాయి. ఇవి అమలులోకి రానప్పుడు ఫలితం ఏముంటుంది? హిమాలయాలు వంటి సున్నిత ప్రాంతాల్లో అడవులను నరికి వేయడం, నిర్మాణాలు చేపట్టడం ఫలితంగా తీవ్ర వైపరీత్యాలు సంభవిస్తుండటం మనకు నిత్యం అనుభవమవుతున్నాయి. ఆసియా మొత్తం మీద అటవీ భూములు తగ్గిపోగా, అభివృద్ధి నిర్మాణాల పేరుతో అటవీ భూముల పరిరక్షణ చట్టాలనే మార్చి వేస్తున్నారు. ఇవన్నీ పరిశీలిస్తే ఇంతవరకు జరిగిన వాతావరణ సదస్సులు ప్రమాణ పత్రాలకే పరిమితమైన మొక్కుబడి సదస్సులుగా మిగిలిపోయాయి.

## తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధి

న్యూఢిల్లీ,రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతాల గురించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.. ముఖ్యంగా వరంగల్ ఎయిర్ పోర్టు పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. భూ సేకరణ ఎంత తొందరగా పూర్తయితే.. అంత త్వరగా ఎయిర్ పోర్టు నిర్మాణ పనులు చేపడతామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, ఆదిలాబాద్ ప్రాంతాల్లో ఎయిర్ పోర్టు నిర్మాణాలు చేపట్టాలని సీఎం ప్రతిపాదించారు.దిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశమయ్యారు. ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వ హయాంలోనే వరంగల్ విమానాశ్రయాన్ని నూటికి నూరుపాళ్లు పూర్తి చేస్తామని కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. వరంగల్‌తోపాటు మరో మూడు.. పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తమను కోరారన్నారు. అయితే పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం విషయంలో ఫీజిబిలిటీ స్టడీ చేయాల్సి ఉందన్నారు. అందుకు సంబంధించిన నివేదిక సానుకూలంగా వస్తే.. అనంతరం భూసేకరణకు వెళ్ల వచ్చని ఆయన చెప్పారు. ఇక ఆదిలాబాద్ విమానాశ్రయం మాత్రం రక్షణ శాఖ పరిధిలో ఉందని గుర్తు చేశారు. ఆ శాఖ నుంచి అనుమతి వస్తే.. ఆదిలాబాద్‌లో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అదీకాక ఆదిలాబాద్‌కు ఓ వైపు చత్తీస్‌గఢ్, మరోవైపు మహారాష్ట్రలు సరిహద్దులు ఉన్నాయన్నారు. దీంతో ఆ దరిదాపుల్లో విమానాశ్రయం లేదని గుర్తు చేశారు. అక్కడ విమానాశ్రయం ఏర్పాటు చేస్తే చాలా మందికి ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అభిప్రాయపడ్డారు. మరోవైపు వరంగల్ విమానాశ్రయం విషయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రో యాక్టివ్‌గా వ్యవహరిస్తూ.. భూసేకరణకు ఇప్పటికే సర్క్యులర్ సైతం జారీ చేసిందని ఆయన వివరించారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా వరంగల్‌లో విమానాశ్రయాన్ని నిర్మిస్తామని ఆయన ప్రకటించారు. ఢిల్లీ పర్యటన కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ సోమవారం హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి బిజీ బిజీగా గడుపుతున్నారు. మంగళవారం ఉదయం కేంద్ర పౌర విమానాయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. అంతకుముందు పౌర విమానయాన శాఖ మంత్రి కార్యాలయానికి సీఎం రేవంత్ రెడ్డి విచ్చేయడంతో.. ఆయనకు ఎదురేగి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇద్దరు ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత తన కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలను కేంద్ర మంత్రి శాలువాలతో సత్కరించి.. తిరుమల శ్రీవారి ప్రతిమలను వారికి అందజేశారు. అనంతరం వారు.. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతోపాటు ఆ శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.తెలంగాణలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటుకు అనుమతితోపాటు వరంగల్ విమానాశ్రయం అంశాలపై వారు కులంకుషంగా చర్చించారు. ఈ పర్యటనలో భాగంగా పలువురు కేంద్రమంత్రులను సైతం సీఎం రేవంత్ రెడ్డి కలవనున్నారు. రాష్టానికి రావాల్సిన ప్రాజెక్టులు,నిధులు తదితర అంశాలను ఈ సందర్భంగా వారితో సీఎం చర్చించనున్నారు.

## రాజకీయ జీవితంలో మాయని మచ్చ!

మహారాష్ట్ర,మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎన్నో రాజకీయ ఆవిష్కరణలకు వేదికగా నిలిచాయి. ముఖ్యంగా శివసేన మీద హక్కు ఎవరిది అనే ప్రశ్నకు మహారాష్ట్ర ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన దుమ్మురేపింది. అటు ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన మాత్రం పూర్తిగా చతికిలపడింది. నిజానికి గతంలో షిండేను ట్రయిటర్‌గా పిలి చింది ఉద్ధవ్ వర్గం. ఆయన్ను పార్టీ ద్రోహీగా అభివర్ణించింది. అయనే ప్రజలు మాత్రం షిండే వైపే నిలబడ్డారు. దీనికి కొన్ని కారణాలను వివరిస్తున్నారు విశ్లేషకులు. ముఖ్యంగా ఆయన సీఎంగా ఉన్నప్పుడు లడ్కీ బహిన్ యోజన లాంటి పథకాలను ప్రవేశపెట్టారు. ఈ ఒక్క స్కీమ్ ద్వారా 2 కోట్లకు మందికిపైగా మహిళలకు ప్రతినెల రూ. 1,500 నగదు అందింది. ఇక కొన్ని కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చారు. వృద్ధుల కోసం ఉచిత పుణ్యక్షేత్ర యాత్రలను ప్రారంభించారు. సామాజికంగా వెనుకబడిన మహిళలకు ఉచిత విద్యను అందించే పథకాలను తీసుకొచ్చారు. ఇలాంటి సంక్షేమ పథకాలతో, షిండే తనను ప్రజల నాయకుడుగా, అసలైన శివసేన పార్టీకి లీడర్‌గా పేరును నిలబెట్టుకున్నారు.

సిద్ధాంతాలకు విరుద్ధంగా షిండే ప్రచారం:

అయితే శివసేనను రెండుగా చీల్చింది కూడా షిండేనే! ఆయన రెబల్‌గా మారి ఉద్ధవ్ ఠాక్రేపై 2022 జూన్‌లో తిరుగుబాటు చేశారు. ఆ తర్వాత బీజేపీ మద్దతుతో సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. నాడు ఏక్‌నాథ్ షిండేకు ఏకంగా 39 మంది శివసేన ఎమ్మెల్యేలు మద్దతుగా నిలిచారు. అంతకముందు మహారాష్ట్రకు సీఎంగా ఉద్ధవ్ ఠాక్రే ఉన్నారు. ఇక ఈ ఘటనల తర్వాత శివసేన రెండు ముక్కలైంది. పార్టీల సింబల్ విషయంలోనూ తన్నుకుంది. ఆ తర్వాత పార్టీ సింబల్ కూడా షిండే వర్గానికే దక్కింది. ఇలా శివసేన రెండు వర్గాలుగా విడిపోయి 2024 మహారాష్ట్ర అసెంబ్లీ బరిలో దూకాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన-కాంగ్రెస్‌తో పాటు శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి మద్దతు ఇచ్చి ఎన్నికల పోటిలో నిలిచింది. అయితే కాంగ్రెస్, %చీజూ%తో జట్టు కట్టడం శివసేన కోర్ సిద్ధాంతాలకు విరుద్ధంగా ఉందని షిండే బాగా ప్రచారం చేశారు. 1966లో బాల్ ఠాక్రే స్థాపించిన శివసేన హిందుత్వ ఐడియాలజీను బలంగా నమ్ముతుంది. అయితే ఉద్ధవ్ మాత్రం సెక్యూలర్ పార్టీగా ముద్రపడ్డ NCP, కాంగ్రెస్‌తో పోత్తు పెట్టుకోవడాన్ని షిండే వర్గం తప్పుబట్టింది. ఇలా ఉద్ధవ్, షిండే ఇద్దరూ కూడా బాల్ ఠాక్రేని సెంట్రిక్‌గా చేస్తూ ప్రచారం చేశారు. అయితే ప్రజలు మాత్రం రియల్ శివసేనగా షిండే వర్గాన్నే నమ్మినట్టుగా ఫలితాలు చూస్తే అర్థమవుతోంది.ఇక ఈ ఎన్నికల ఫలితాలు మరో కీలక అంశానికి వేదికగా నిలిచాయి. ఎన్సీపీ నేత శరద్ పవార్ వర్గానికి ఈ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పవార్ వర్గం తక్కువ స్థానాలతోనే సరిపెట్టుకుంది. అటు %చీజూ%లో మరో వర్గమైన అజిత్‌పవార్ టీమ్ సత్తా చాటింది. రాజకీయాల్లో ఇక యాక్టివ్‌గా ఉండబోనన్న సంకేతాలను ఈ మధ్యే ఇచ్చారు శరద్ పవార్ . ఈ ఎన్నికల ఫలితాలు చూస్తుంటే..పవార్ ను ఇక ఇంట్లోనే కూర్చోమని మహారాష్ట్ర ప్రజలు సంకేతాలు ఇచ్చినట్టుగా కనిపిస్తోంది.

# ఇచ్చిన మాట ప్రకారం కులగణన

న్యూఢిల్లీ,తెలంగాణలో ఇచ్చిన మాట ప్రకారం కుల గణన చేపడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సంవిధాన్ రక్షణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు, దళితులకు, ఆదివాసులకు భూ చట్టాలు తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. భారత్ జోడో యాత్ర పేరిట రాహుల్ గాంధీ అన్ని వర్గాల ప్రజలను కలుస్తూ వారి ఇబ్బందులు తెలుసుకున్నారని అన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో రిజర్వేషన్లు అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు గాంధీ పరివార్ ఉందని.. రాహుల్ గాంధీకి అండగా తాము ఉన్నామని వ్యాఖ్యానించారు. రైతుల తరఫున నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ ఆందోళన చేశారని.. అందుకే కేంద్రం నల్ల చట్టాలను వెనక్కి తీసుకుందని వివరించారు. తెలంగాణ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా కులగణన చేపట్టింది. కొన్ని చోట్ల ఇప్పటికే ప్రజల నుండి వివరాలు నమోదు చేసుకుంది. మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో సర్వేను పర్యవేక్షిస్తూ సర్వే సిబ్బందికి మార్గనిర్దేశం చేస్తున్నారు. సర్వేలో మొత్తం 85 వేల మంది ఎన్యుమరేటర్లు, 8,500 మంది సూపర్‌వైజర్లు పాల్గొంటున్నారు. ఇంటి నంబరు, యజమాని పేరు నమోదు చేసే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు పాల్గొంటున్నారు. ప్రతి కుటుంబంలో సభ్యులందరి ఫోన్, ఆధార్ నంబర్లు సహా సమస్త వివరాలతో కూడిన 75 ప్రశ్నలను అడిగి నమోదు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో మొత్తం 1,17,44,954 కుటుంబాలున్నాయని.. ఇళ్లను 87,092 ఎన్యుమరేషన్ బ్లాకులుగా విభజించి కులగణన చేపట్టినట్లు రాష్ట్ర ప్రణాళిక శాఖ తెలిపారు.అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, రాహుల్ గాంధీ నాయకత్వంలో అందరికి సామాజిక న్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితర కీలక నేతలు హాజరయ్యారు. దేశంలో రాజ్యాంగ పవిత్రతను కాపాడింది కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. గాంధీ పరివార్ రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నం చేస్తుంటే.. మోడీ పరివార్ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేస్తోందన్ని ÷ర్ ఆయ్యారు. రాజ్యాంగ పరిరక్షణలో రాహుల్ గాంధీ వెంట దేశ ప్రజలంతా ఉన్నారన్నారు. ప్రతి ఒక్క వర్గానికి కాంగ్రెస్ పార్టీ న్యాయం చేసిందని.. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కాపాడింది కాంగ్రెస్సేనని వ్యాఖ్యానించారు. కుల గణనతోనే ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయని.. ఇందుకోసమే దేశవ్యాప్తంగా కుల గణన కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని తెలిపారు. దేశంలో సామాజిక న్యాయాన్ని అందించింది ఒక్క కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట ఇచ్చినట్లుగానే తెలంగాణలో కుల గణన చేపట్టామన్నారు.. కుల గణన సర్వే ఇప్పటి వరకు 92 శాతం పూర్తి అయ్యిందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జన గణన సర్వేలోనూ కులాల లెక్కలు తీయాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

# వాహన యజమానుల పెండింగ్ చలాన్ల డేటా సేకరణ

వరంగల్,వరంగల్ నగరంలో నిత్యం ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి వారికి లీగల్ నోటీసులు అందజేసే పనిలో పడ్డారు ట్రాఫిక్ పోలీసులు. పోలీసులు తమ వాహనంపై పదికి పైగా చలాన్లు పెండింగ్‌లో ఉన్న వాహన యజమానుల డేటాను సేకరించారు , వారిలో ఇప్పటివరకు 5,431 మందికి లీగల్ నోటీసులు పంపారు. నగర పోలీసులు తరచూ తనిఖీలు నిర్వహించి అక్రమార్కులకు జరిమానాలు విధించడం ద్వారా ఈ పద్ధతిని అరికట్టేందుకు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ప్రస్తుత సంవత్సరంలో ట్రాఫిక్ పోలీసులు 1115 మందిపై చార్జిషీట్లు దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచి జరిమానాలు వసూలు చేశారు. నగరంలో అక్రమాలకు పాల్పడిన 71,782 వాహనాలు రోడ్లపై తిరుగుతున్నాయని పోలీసులు గుర్తించి, వాటిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొలుత మూడు చలాన్లు దాటిన వాహనదారులపై చార్జిషీట్లు దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచారు. చలాన్లు చెల్లించకుండా తప్పించుకున్న వాహనదారులను స్పెషల్ డ్రైవ్‌లో పట్టుకుని వారి వాహనాలను సీజ్ చేశారు. గతంలో రెండుసార్లు చలాన్లపై భారీ రాయితీ ఇచ్చినా చాలా మంది వినియోగించలేదు. ప్రస్తుతం 150 పెండింగ్‌లో ఉన్న చలాన్ వాహనాలు నగర రోడ్లపై తిరుగుతున్నాయని ట్రాఫిక్ అధికారులు తెలిపారు. జరిమానా విధించిన మూడు రోజుల్లోనే ఇ-చలాన్‌లు స్వయంచాలకంగా కోర్టుకు రిఫర్ చేయబడతాయని, ఉల్లంఘించిన వారిపై ప్రత్యక్ష చర్యలు తీసుకునే అధికార పరిధి పోలీసులకు లేకుండా పోతుందని పోలీసు అధికారులు వెల్లడించారు . పర్యవసానంగా, చలాన్లతో సంబంధం ఉన్న భయ భావం ప్రజల్లో తగ్గిపోయింది.ట్రాఫిక్ పోలీసులు అత్యధిక సంఖ్యలో ఉల్లంఘనలకు పాల్పడుతున్న వాహనాలను గుర్తించారు, చాలా వాహనాలు తక్కువ ప్రభావంతో ఏడాది పొడవునా నిబంధనలను పదేపదే ఉల్లంఘిస్తున్నాయని సూచిస్తున్నాయి. "ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినందుకు వాహనాలపై చలాన్‌లు నిరంతరం జారీ చేయబడతాయి , మొత్తం పెరుగుతూనే ఉంటుంది. వాహన యజమాని దానిని విక్రయించడానికి ప్రయత్నించే వరకు ప్రభావితం కాదు, ఎందుకంటే అమ్మకం సమయంలో %=ూ% ద్వారా నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ అందించబడుతుంది , ఆ తర్వాత మాత్రమే పెండింగ్ చెల్లింపులను పరిష్కరించాలి, "అని ఒక అధికారి తెలిపారు. ఈ ఏడాది చివరి వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న చలాన్లన్నీ చెల్లించేలా చూడాలని ట్రాఫిక్ పోలీసులు నిర్ణయించారు.

## ఈవీఎంలు వద్దు.. బ్యాలెట్ పేపరే కావాలి

న్యూఢిల్లీ,ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లతో ఓటింగ్‌లో అవకతవకలు జరుగుతున్నాయని, వాటికి బదులుగా ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్స్‌నే వినియోగించాలని కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈవీఎంలలో ఎలాంటి లోపాలు లేవని, ఈవీఎంలకు వ్యతిరేకంగా వచ్చే ఫిర్యాదులను తాము ఎంటర్‌టైన్ చేయదల్చుకోలేదని కేఏ పాల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన రోజే ఖర్గే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.'ఈవీఎంలను పక్కన పెట్టాలంటే మనం అందరం ఒక్కతాటిపైకి రావాల్సిన అవసరం ఉంది. నేను ఎన్నికల గురించి మాట్లాడాలనుకోవడం లేదు. అయితే ఈవీఎంల కారణంగా పేద, బడుగు బలహీన వర్గాల ఓట్లు వృథా అవుతున్నాయి. వాళ్లంతా బ్యాలెట్ పేపర్ ఓటింగ్‌నే కోరుకుంటున్నారు' అని ఖర్గే చెప్పారు. ఢిల్లీలోని తల్కతోరా స్టేడియంలో జరిగిన సంవిధాన్ రక్షక్ అభియాన్ కార్యక్రమంలో ఖర్గే మాట్లాడారు. 'ఈవీఎంలు వాళ్ల దగ్గరే పెట్టుకోనివ్వండి. మాకు ఈవీఎంలు వద్దు. మేం బ్యాలెట్ పేపర్‌తో జరిగే ఓటింగ్‌ను కోరుకుంటున్నాం.' అని ఖర్గే అన్నారు. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ కోసం రాహుల్‌గాంధీ మరోసారి భారత్ జోడో యాత్ర చేయాలని ఖర్గే

# భారత ఆర్థిక,రాజకీయాలపై గౌతమ్ అదానీ వ్యవహారం ప్రభావం

న్యూఢిల్లీ,అమెరికాలో ఇంధనం, మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రాజెక్టుల్లో రూ. 84,492 కోట్ల (10 బిలియన్ డాలర్లు) పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నట్లు అమెరికా కొత్త అధ్యక్షుడిగా డోనల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత భారత పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ప్రకటించారు. ఇప్పుడు అదానీపై అమెరికాలో కేసు నమోదు కావడం అటు రాజకీయ రంగంతోపాటు ఇటు వ్యాపార రంగంలోనూ తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. భారత్‌లో సోలార్ పవర్ ప్రాజెక్టులు దక్కించుకోవడానికి అదానీ గ్రూప్.. వివిధ రాష్ట్రాల్లోని ఉన్నతాధికారులకు 265 మిలియన్ డాలర్లు (రూ. 2,238 కోట్లు) లంచంగా ఇవ్వజూపినట్టు న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టులో అభియోగాలు నమోదయ్యాయి. ఇదే విషయమై ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారానికి సంబంధించి గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు, అదానీ గ్రీన్ ఎనర్జీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ సాగర్ అదానీతో పాటు మరో ఆరుగురిపై కేసులు నమోదవ్వడమే గాకుండా యూఎస్ కోర్టు అరెస్టు వారెంట్ కూడా జారీ చేసింది. ఈ వ్యవహారంపై తాజాగా అమెరికా స్పందించింది. ఈ సంక్షోభాన్ని ఇరు దేశాలు అధిగమించగలవని తాము విశ్వసిస్తున్నట్లు అధ్యక్ష భవనం శ్వేతసౌధం ఓ ప్రకటనలో తెలిపింది. భారత్-అమెరికా సంబంధాలు దృఢంగా ఉన్నాయని, ఈ సంక్షోభాన్ని ఇరు దేశాలు కలిసి అధిగమిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. అసలేం జరిగిందంటే...ప్రపంచ దేశాలు పునరుత్పాదక శక్తి రంగంవైపు అడుగులు వేస్తున్న క్రమంలో సౌర విద్యుత్తు రంగంలో పెద్దయెత్తున పెట్టుబడులు పెట్టాలని అదానీ గ్రూప్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా భారత్‌లో భారీ సోలార్ ఎనర్జీ ప్రాజెక్టులు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ క్రమంలో ఎలాంటి పోటీ లేకుండా కాంట్రాక్ట్ టెండర్లను దక్కించుకొనేందుకు ఏపీ, ఒడిశా, తమిళనాడు, జమ్ముకశ్మీర్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ఉన్నతాధికారులకు అదానీ గ్రూప్ ప్రతినిధులు రూ. 2,238 కోట్ల మేర లంచాలు ఆఫర్ చేసినట్టు అమెరికా ఎఫ్‌బీఐ తన ఆరోపణల్లో వెల్లడించింది. తద్వారా వచ్చే 20 ఏండ్లలో కనిష్ఠంగా 2 బిలియన్ డాలర్లు లబ్ధి పొందేందుకు అదానీ గ్రూప్ ప్రణాళిక సిద్ధం చేసినట్టు ఆరోపించింది. ఈ లంచం సొమ్మును సేకరించడానికి బ్యాంకులు, పెట్టుబడిదారులకు తప్పుడు సమాచారం ఇచ్చి మోసపుచ్చే ప్రయత్నాలు చేసినట్టు తెలిపింది. అమెరికా ఫెడరల్ కోర్టులో అదానీకి సంబంధించి ముఖ్యంగా రెండు అభియోగాలు నమోదైనట్టు అంతర్జాతీయ పత్రిక రాయిటర్స్ వెల్లడించింది. అందులో ఒకటి.. తప్పుడు సమాచారం చూపించి 2 బిలియన్ డాలర్ల మేర రుణాలకు అర్జీ పెట్టడం కాగా రెండోది.. అంతర్జాతీయ ఫైనాన్షియల్ సంస్థలు ఇచ్చిన భరోసాను చూపించి అమెరికాతో పాటు ఇతర దేశాల్లోని మదుపర్లకు 1 బిలియన్ డాలర్ల విలువైన బాండ్లను ఆఫర్ చేయడం.ఈ రెండు అభియోగాలపై న్యూయార్క్‌లోని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ కోర్టు అదానీ సహా ఏడుగురికి నోటీసులు జారీ చేసింది. మరోవైపు, ఫెడరల్ సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘించిన కారణంగా గౌతమ్ అదానీ, సాగర్ అదానీతో పాటు ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న అజురా పవర్ అనే కంపెనీకి కూడా ఇదే కేసులో తాము నోటీసులు పంపించినట్టు యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) ఒక ప్రకటనలో వెల్లడించింది. కాగా, ఈ కేసులో నిందితులు ఎఫ్‌బీఐ, ఎస్ఈసీ దర్యాప్తును అడ్డుకోవడానికి కుట్ర పన్నినట్టు కోర్టు ఈ సందర్భంగా పేర్కొనడం గమనార్హం. అ దా నీ పై అమెరికాలో కేసు నమోదుకావటం ఇప్పటికే భారత ఆర్థిక వ్యవస్థపై, అదానీ గ్రూపుపై ప్రభావం చూపుతున్నాయి. తాజా ఆరోపణలకు కేంద్రంగా ఉన్న అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీ కూడా 60 కోట్ల డాలర్ల (సుమారు రూ. 5 వేల కోట్లు) బాండ్ల జారీ విషయంలో ముందుకు వెళ్లలేమని ప్రకటించింది. అదానీతో భారత దేశ ఆర్థిక వ్యవస్థ లోతుగా ముడిపడి ఉంది. ఆయన దేశంలో 13 ఓడరేవులు



(30 శాతం మార్కెట్ వాటా), ఏడు విమానాశ్రయాల(ప్రయాణికుల రద్దీలో 23 శాతం)తో పాటు సిమెంట్ వ్యాపారం (20 శాతం మార్కెట్ వాటా) నిర్వహిస్తున్నారు. దేశంలో రెండో అతిపెద్ద సిమెంట్ వ్యాపారం అదానీదే. ఆరు బొగ్గు ఆధారిత పవర్ ఎ÷-లాంట్‌లు కూడా ఆయన సొంతం. దేశంలోని విద్యుత్ రంగంలో ఆయనే అతిపెద్ద ప్రైవేట్ ప్లేయర్. గ్రీన్ హైడ్రోజన్ రంగంలో 50 బిలియన్ల డాలర్ల(సుమారు రూ. 4 లక్షల కోట్లు) పెట్టుబడి పెడతానని చెప్పడంతో పాటు 8,000 కిమీ పొడవైన సహజ వాయువు పైప్‌లైన్‌ను నిర్వహిస్తున్నారు. దేశంలోని అత్యంత పొడవైన ఎక్స్‌ప్రెస్‌వేని నిర్మిస్తున్నారు. అలాగే అతిపెద్ద మురికివాడను అందంగా తీర్చిదిద్దే పనిలో ఉన్నారు. ఆయన వద్ద 45,000 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా కూడా పలు దేశాల్లో ఆయన వ్యాపారాలు ఉన్నాయి. ఇండోనేసియా, ఆస్ట్రేలియాల్లో బొగ్గు గనులతో పాటు కెన్యా, మొరాకోలో ఇంధన ప్రాజెక్టులు నిర్వహిస్తున్నారు. టాంజేనియా, కెన్యాలోనూ మౌలిక వసతుల ప్రాజెక్టులపై దృష్టి సారించారు. గౌతమ్ అదానీ కంపెనీ దశాబ్దాలుగా స్టాక్ మ్యానిపులేషన్, అకౌంటింగ్‌లో మోసాలకు పాల్పడిందంటూ అమెరికా షార్ట్ సెల్లర్ కంపెనీ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ 2023 జనవరిలో ఒక నివేదికను విడుదల చేసింది. దురుద్దేశపూర్వకంగా, తప్పుడు సమాచారంతో ఈ నివేదికను రూపొందించారని అదానీ గ్రూపు తోసిపుచ్చింది. ఆ తర్వాత దాదాపు రెండేళ్లుగా తన ఇమేజ్‌ను పునర్నిర్మించుకునేందుకు అదానీ ప్రయత్నిస్తున్న తరుణంలో తాజాగా లంచానికి సంబంధించిన ఆరోపణలు మరోసారి ఆయనను చుట్టుముట్టాయి. తాజా ఆరోపణలు మార్కెట్ సెల్-ఆఫ్‌ను, దర్యాప్తును ప్రేరేపించాయి. భారత మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఈ ఆరోపణలపై దర్యాప్తు చేస్తోంది. ప్రస్తుతం స్వదేశంలో ప్రాజెక్టుల కోసం మూలధనాన్ని సేకరించడం అదానీకి ఇది సవాలుగా మారొచ్చు. మార్కెట్ స్పందించిన తీరును చూస్తే ఇది ఎంత తీవ్రమైన అంశమో తెలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించాలనుకున్న అదానీ ప్రణాళికలకు తాజా అభియోగాలు ఆటంకంగా మారొచ్చు. ఒక అంతర్జాతీయ విమానాశ్రయాన్ని టేకోవర్ చేయడంతో పాటు వివాదాస్పద ఇంధన ఒప్పందానికి సంబంధించి ఇప్పటికే ఆయన కెన్యా, బంగ్లాదేశ్‌లో సవాళ్లను ఎదుర్కొన్నారు. ఇప్పటికే, గౌతమ్ అదానీ గ్రూప్‌తో ఉన్న రెండు కీలక ఒప్పందాలను కెన్యా అధ్యక్షుడు విలియం రూటో రద్దు చేశారు. తమ విచారణ సంస్థలు, భాగస్వామ్య దేశాలు అందించిన కొత్త సమాచారం ఆధారంగా ఒప్పందాలను రద్దు చేసినట్లు రూటో చెప్పారు. ఇక రాజకీయంగా చూస్తే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇప్పటికే దీనిపై మాట్లాడారు. అదానీని అరెస్ట్ చేయాలంటూ పిలుపునిచ్చారు. భారత్‌లోని ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వడం ఇక్కడ వార్త కాదు. కానీ, అందులో పేర్కొన్న మొత్తాలు భారీ స్థాయిలో ఉన్నాయి. ఈ లంచాన్ని అందుకున్న కొంతమంది పేర్లు కూడా అమెరికా వద్ద ఉండొచ్చని అనుమానంగా ఉంది. ఇది భారత రాజకీయాల్లో కలకలం రేపొచ్చు. ఈ కేసులో ఇంకా చాలా విషయాలు బయటకు రావాల్సి వుంది.

# వ్యవసాయంపై రైతులకు తగ్గుతున్న ఆసక్తి..



హైదరాబాద్,నిత్యావసర ధరలు, వైద్య ఖర్చులపై కేంద్రం తాజాగా నివేదిక వెల్లడించింది. ధరల జాతీయ సగటు దాదాపు వంద శాతం నుంచి 200 శాతం వరకు పెరిగినట్లు 'వినియోగదారుల ధరల సూచిక (కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్-సీపీఐ)', వినియోగదారుల ఆహార ధరల సూచిక (కన్స్యూమర్ ఫుడ్ ప్రైస్ ఇండెక్స్-సీఎఫ్‌పీఐ) 2024 నివేదిక వెల్లడించింది. చాలా రాష్ట్రాలలో సరైన సాగు పద్ధతులు లేకపోవడంతోపాటు పెట్టుబడి కూడా ఎక్కువ కావడంతో ధరల పెరుగుదలపై తీవ్ర ప్రభావం పడుతోంది. గతంలో పల్లె జనాభాలో 70శాతానికిపైగా రైతు కుటుంబాలు ఉండేవి. ఆ కుటుంబా ల్లోనూ దాదాపుగా అందరూ వ్యవసాయంలో భాగస్వాములు అయ్యేవారు. కానీ, ఇప్పుడు పల్లెల్లో రైతులు 50శాతం కూడా లేరు.నిజానికి పల్లెల్లో వ్యవసాయం ఇప్పుడు ప్రధాన వృత్తి కాదు. రియల్ ఎస్టేట్, రిటైల్ షాపులు సహా బట్టల దుకాణాలు, చికెన్ షాపులు ఇలా ఎన్నో ఉప వృత్తుల వైపు రైతు కుటుంబాలు దృష్టి సారిస్తున్నాయి. ఫలితంగా వ్యవసాయం, అంతరపంటలపై ఎవరికీ పెద్దగా ఆసక్తి ఉండటం లేదు. గతంలో ప్రతి ఇంటికీ కూరగాయల పాదులు, కోళ్లు, మేకలు, గొర్రెలు, ఆవులు, బర్రెల పెంపకం ఉండేది. కానీ, ఇప్పుడు వాటి పెంపకం రైతు కుటుంబాల జీవనశైలికి ఆటంకంగా మారింది. ఏదైనా పెళ్లి పేరంటానికి వేరే ఊరికి వెళ్లాల్సి వస్తే కోళ్లు, మేకలు, గేదెల కోసం ఎవరో ఒకరు తప్పక ఉండాల్సి వస్తుంది. అందుకు చాలామంది సిద్ధంగా లేకపోవడంతో వాటి పెంపకమే తగ్గిపోయింది. పల్లెల్లోకి కూడా ప్యాకెట్ పాలు వస్తుండటంతో ఆవులు, బర్రెలను పెంచాల్సిన అవసరం ఏమున్నది? అనే ప్రశ్నలు వస్తున్నాయి. గతంలో అంతరపంటలు సహా ప్రధాన పంటలకు విత్తనాలు సొంతంగా అభివృద్ధి చేసుకునేవారు. ఇప్పుడు కంపెనీలే విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తుండటం.. అంతరపంటల విత్తనాలు నాసిరకంగా ఉంటుండటంతో చాలామంది రైతులు శ్రద్ధ చూపడంలేదు. ఫలితంగా గ్రామాల్లో ఆదాయం చాలా తగ్గిపోయింది. ఒకప్పుడు బోడకాకరకాయ పల్లెల్లో పెంటలపై మొలిచేది. వాటిని చాలామంది తినేవారు కూడా కాదు. కానీ, ఇప్పుడు పట్టణాల్లో దాని ధర కిలో 200పైమాటే. పూర్వం రైతులు వరి, పెసర, కంది సజ్జలు, నువ్వులు, ఉలవలు, రాగులు, మినుములు పజ్జొన్నలు, ఎర్ర జొన్నలు, తెల్ల జొన్నలు, మక్కజొన్న, బుడ్డ శనగలు, అలసంద, గోధుమ తదితర పంటలు సాగు చేసేవారు. ఈ సంప్రదాయ వ్యవసాయం వల్ల పల్లెల్లో గ్రామీణ స్వయం పోషక విధానం ఉండేది. కానీ.. ఇప్పుడు చిరుధాన్యాలు, ఆరుతడి పంటల సాగు తగ్గిపోయింది. దీంతో మనం చిరుధాన్యాలు, పప్పు దినుసులు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దాంతో లక్షల టన్నుల వ్యవసాయ ఉత్పత్తులు తగ్గిపోతున్నాయి. ఫలితంగా ధరలు పెరుగుతున్నట్లు సర్వేలు చెబుతుండగా.. సామాన్యుడు బతకలేని పరిస్థితికి వచ్చింది.వ్యవసాయం చేయడం దండుగ అని ఇప్పటికే చాలామంది రైతులు అభిప్రాయపడుతున్నారు. తమ పిల్లలను మాత్రం ఈ రొంపిలోకి దింపొద్దని బలంగా అనుకుంటున్నారు. చాలామందిలో ఈ అభిప్రాయం ఉండటంతో అసలు వచ్చే కొన్నేళ్లలో వ్యవసాయంలోకి కొత్త తరం వస్తుందా? అనే భయాలు నెలకొన్నాయి. గతంలో ప్రతి రైతు తమకు ఉన్న నైపుణ్యాలతో సాగు మెళకువలు పెంచుకుంటూ కొత్త ప్రయోగాలు చేస్తూ దిగుబడి పెంచుకునేవారు. రకరకాల ఉపయోగకరమైన చిరుధాన్యాలు సహా పప్పు దినుసులు సాగు చేసేవారు. కానీ, ఇప్పుడు పల్లెల్లో ప్రధానంగా వరి.. తర్వాత మొక్కజొన్న, పత్తి తప్ప మిగతా పంటలపై దృష్టి పెట్టడంలేదు. వరికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటిస్తుండటంతో పంటకు మినిమం గ్యారంటీ అన్న కోణంలో రైతులు ఆలోచిస్తున్నారు. కానీ, చిరుధాన్యాలు, పప్పుదినుసులు పండిస్తే అంతకుమించి లాభం వస్తుందని రైతులకు తెలిసినా.. ధైర్యం చేయలేకపోతున్నారు. అకాల వర్షాలకు ఇతర పంటలు నష్టపోతే ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వదని.. దిగుబడి అనుకున్నంత రాకపోతే ఎలా అన్న భయాలు వారిని కొత్త పంటల దిశగా ఆలోచించనీయడంలేదు. ప్రభుత్వాలు, ముఖ్యంగా వ్యవసాయ అధికారులు చొరవ తీసుకుని రైతులకు తగిన సలహాలు ఇస్తే పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం ఉంటుంది.మరోవైపు, పిల్లల చదవుల కోసం చాలా మంది యువ రైతులు వ్యవసాయాన్ని వదిలేస్తున్నారు. పల్లెల్లోని మౌలిక వసతుల లేమి వల్ల పట్టణాలు నగరాలకు వలసపోతున్నారు. వాచ్‌మన్ ఉద్యోగాలు, లేబర్ పనులు కూడా చేయడానికి వెనుకాడటం లేదు. చాలా రైతు కుటుంబాలు వ్యవసాయం నుంచి తప్పుకుంటుండటంతో రాబోయే రోజుల్లో కార్పొరేట్ కంపెనీలు వ్యవసాయంలోకి అడుగుపెడతాయి. రైతులనుంచి భూమి లీజుకు తీసుకుని వ్యవసాయం చేస్తాయి. పూర్తి యాంత్రీకరణతో ఆహార ఉత్పత్తులపై పూర్తి ఆజమాయిషీ సాధిస్తాయి. అప్పుడు కిలో రూ. 1000 అయినా ఆశ్చర్యం ఉండదు. పైగా కార్పొరేట్ కంపెనీలు అగ్రదేశాలకు ఎగుమతి చేయడానికే ఎక్కువ ఆసక్తి చూపుతాయి.. కార్పొరేట్ కంపెనీలు వ్యవసాయంపై ఆజమాయిషీ సాధిస్తే దేశంలో ఆహార లభ్యత సహా ఆహారపుటలవాట్లు కూడా వారే నిర్దేశిరచే పరిస్థితి వస్తుంది. దేశంలో సగటున వ్యక్తి ఆదాయం 12 ఏళ్లలో రెట్టింపైనా.. జీవన ప్రమాణాల్లో మాత్రం ఎలాంటి మార్పు లేదు. సామాన్యుల రోజువారీ జీవనానికి కావాల్సిన నిత్యావసర వస్తువుల నుంచి వైద్యం వరకూ ఖర్చులు అంతే స్థాయిలో పెరిగాయి. 'వినియోగదారుల ధరల సూచిక (కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్-సీపీఐ)', వినియోగదారుల ఆహార ధరల సూచిక (కన్స్యూమర్ ఫుడ్ ప్రైస్ ఇండెక్స్-సీఎఫ్‌పీఐ) 2024 ఆగస్టు నివేదికను ఎన్ఎస్ఎస్ఓ సంస్థకు చెందిన క్షేత్రస్థాయి సిబ్బంది తయారు చేశారు. వీరు దేశవ్యాప్తంగా 1,114 పట్టణాల్లోని మార్కెట్లు, 1,181 గ్రామాల నుంచి సేకరించిన ధరల వివరాలతో సిద్ధం చేశారు. దాని ప్రకారం ఈ ఆగస్టు నివేదికను విడుదల చేశారు.

# జర్నలిస్టులకు ఇల్లస్థలాల వ్యవహారం

హైదరాబాద్, జేఎన్‌జే జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి కేటాయించిన ఇండ్ల స్థలాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పును వెలువరించడం అత్యంత బాధాకరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ విషయంపై మంగళవారం హైదరాబాద్‌లో బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు దక్కకపోవడానికి పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ పాలకులే ప్రధాన కారణమని విమర్శించారు. 7 ఏళ్ల క్రితం పుస్తెలు తాకట్టు పెట్టి, అప్పు చేసి ఒక్కో జర్నలిస్టు రూ.2 లక్షల చొప్పున రూ.12 కోట్లు పోగు చేసి ప్రభుత్వానికి చెల్లించి జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ పేరుతో స్థలాలు దక్కించుకున్నారని గుర్తుచేశారు. నాటి నుంచి నేటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఏదో ఒకసాకు చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు చేతికి అందించకుండా తీవ్రమైన అన్యాయం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో జర్నలిస్టుల బతుకులు మరీ దుర్భరంగా ఉన్నాయని వాపోయారు. ఇండ్ల స్థలాలడిగితే లాఠీలతో కొట్టించారని ఆక్షేపించారు. ప్రశ్నించే జర్నలిస్టులను వారి వృత్తిలో కొనసాగకుండా అడుగడుగునా అవమానించిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయని బండి సంజయ్ గుర్తుచేశారు. 'బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్య ఫలితమే నేటి సుప్రీంకోర్టు తీర్పు. ఈ రెండు పార్టీలు జర్నలిస్టులను రోడ్డు పాల్జేయడమే కాకుండా చేతికి వస్తుందని వేయికళ్లతో ఎదురు చూసిన ఇండ్ల స్థలాలను చేతికి అందకుండా చేశాయి. జర్నలిస్టుల నోటికాడ ముద్దను లాగేసుకున్నాయి. సుప్రీంకోర్టు తీర్పుతో జర్నలిస్టు కుటుంబాల బాధ వర్ణణాతీతం. అసలు జర్నలిస్టులు చేసిన తప్పేమిటి. ఈ రెండు పార్టీలకు జర్నలిస్టులపై ఎందుకంత కక్ష. పైసాపైసా కూడబెట్టి డబ్బులు చెల్లించినా ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా 17 ఏళ్లు జాప్యం చేస్తారా. నేటి సమాజంలో జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివి. చాలీచాలని జీతాలతో బతుకీడుస్తున్నారు. అయినా తమ వార్తలతో నిరంతరం సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు అహర్నిశలు తపన పడతున్నారు. ప్రభుత్వం వాళ్లకు కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా అన్యాయం చేస్తోంది. వాళ్లకు హెల్త్ కార్డులు కూడా పనిచేయడం లేదు. ఉండటానికి ఇండ్లు లేక అ÷-దదె కట్టలేక, పిల్లల ఫీజులు కూడా చెల్లించే స్థోమత లేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా కుటుంబం కంటే సమాజాన్ని చైతన్యవంతం చేయడమే ప్రధానమని నమ్మి జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నారు. ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూసి ఎంతోమంది జర్నలిస్టులు అసువులు బాశారు. జర్నలిస్టులను ఆదుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తీవ్రంగా విఫలమయ్యాయి' అని బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.'ఇకనైనా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలి. సుప్రీంకోర్టు తీర్పు బాధాకరమే అయినప్పటికీ ప్రభుత్వం తనకున్న విచక్షణ అధికారాలను ఉపయోగించి జర్నలిస్టులకు ఇండ్లను కేటాయించాలి. అలాగే గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఇండ్లులేని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలను వెంటనే మంజూరు చేయాలి. ఈ విషయంలో ప్రభుత్వానికి భారతీయ జనతా పార్టీ పక్షాన పూర్తిగా సహకరించేందుకు సిద్ధం. అలాగాకుండా ఇండ్ల స్థలాలివ్వకుండా జర్నలిస్టులకు అన్యాయం చేస్తే తాము చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. జర్నలిస్టులతో కలిసి మహోద్యమానికి కార్యాచరణ రూపొందిస్తాం. బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పట్టిస్తాం. అదే సమయంలో జర్నలిస్టులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బీజేపీ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్‌లోని జేఎన్జే హౌసింగ్ సొసైటీ జర్నలిస్టులతోపాటు రాష్ట్రంలోని అర్హులైన విలేకరులందరికీ ఇండ్లను కేటాయిస్తాం' అని బండి సంజయ్ హామీ ఇచ్చారు.

## చిన్నారుల మరణాలన్నీ సర్కారీ హత్యలే

హైదరాబాద్:గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టళ్లలో మరణమృదంగాలా అని మండిపడ్డారు. ఎవరిదీ పాపమని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. చిన్నారుల మరణాలన్నీ సర్కారీ హత్యలే అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఉరఫ్ విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం, అసమర్థత కారణంగా తన సొంత జిల్లాలోని మక్తల్ మండలం మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మళ్లీ ఫుడ్ పాయిజన్ జరిగిందని దాసోజు శ్రవణ్ అన్నారు. మధ్యాహ్న భోజనం తిని పలువురు విద్యార్థులకు వాంతులు, తల నొప్పి, కడుపు నొప్పితో విద్యార్థులు విలవిలలాడిపోయారని పేర్కొన్నారు. మక్తల్ ఆస్పత్రికి 30 మంది విద్యార్థులను తరలించారని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 48 మంది ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థుల మరణించారని దాసోజు శ్రవణ్ తెలిపారు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చారని అన్నారు. ఈ పాపం ఎవరిదీ అని ప్రశ్నించారు. ప్రత్యేక విద్యా శాఖ మంత్రి, పూర్తి బాధ్యతలతో ప్రత్యేక ప్రిన్సిపల్ సెక్రటరీని నియమించకుండా రేవంత్ రెడ్డి నిరంకుశ పరిపాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా ముఖ్యమంత్రి ఢిల్లీలో బిజీ బిజీగా ఉన్నారని.. ప్రిన్సిపల్ సెక్రటరీ హైదరాబాద్‌లో బిజీగా ఉన్నారని.. ఈ ఘటనలపై కనీస రివ్యూ కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం మీద బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల జీవితాలతో తమ నిర్లక్ష్యంతో, అసమర్థతతో చెలగాటం ఆడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరనేరానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిద్దరూ ప్రజాకోర్టులో శిక్షార్హులే అని స్పష్టం చేశారు. విద్యార్థులు మరణిస్తున్నా ఈ ప్రభుత్వంలో చలనం ఉండదా అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురై 20 రోజులకు పైగా చికిత్స పొంది గురుకుల విద్యార్థిని శైలజ మరణించిన మరుసటి రోజే.. మళ్లీ ఉమ్మడి పాలమూరులో ఫుడ్ పాయిజన్ ఘటన చోటుచేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాగనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫుడ్‌పాయిజన్ కావడంతో 30 మందికిపైగా విద్యార్థులు అస్వస్థతకు గురి కావడానికి ప్రభుత్వ పర్యవేక్షణ లోపమే కారణమని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న ఇప్పటికీ విద్యాశాఖ, హోం శాఖ, మున్సిపల్ శాఖ మంత్రుల నియామకానికి దిక్కేలేదు అని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వంలోని అనేక శాఖల మీద పర్యవేక్షణ లేకపోవడం మూలంగానే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని అన్నారు. ఏడాది పాలనలో గురుకుల విద్యను దిగజార్చారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో ఎవరెస్టు శిఖరం ఎత్తుగా ఉన్న గురుకులాల ప్రతిష్టను కాంగ్రెస్ భ్రష్టు పట్టించిందని అన్నారు. ప్రతిరోజు రాష్ట్రంలో ఏదో ఒక గురుకుల పాఠశాల, వసతీగృహంలో ఫుడ్ పాయిజన్ కేసులు వెలుగుచూస్తున్నా ప్రభుత్వం కనీసం సమీక్షించడం లేదని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి లేదని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. గిరిజన విద్యార్థి శైలజ మరణం ముమ్మాటికి ప్రభుత్వం హత్యే అని ఆరోపించారు. గురుకులాల్లో జరుగుతున్న సంఘటనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్‌చేశారు. మధ్యాహ్నం భోజనం తిని అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన విద్యార్థులకు నాణ్యమైన చికిత్స అందించాలన్నారు.

# ఆ ఇద్దరిలో అదానీతో దోస్తానీ ఎవరిది?



హైదరాబాద్,తెలంగాణ గడ్డ మీద పొలిటికల్ హీట్ అంతకంతకు పెరుగుతోంది. ఇష్యూ ఏదైనా ఇన్వాల్‌మెంట్ ఉంటే చాలు సీఎం రేవంత్‌ను ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తోంది బీఆర్ఎస్. లేటెస్ట్‌గా అదానీ పవర్ అగ్రిమెంట్స్ వ్యవహారం రచ్చకు దారి తీయడంతో.. స్కిల్ యూనివర్సిటీ కోసం తెలంగాణ సర్కార్ అదానీ నుంచి తీసుకున్న విరాళం హాట్ టాపిక్ అయింది.దీంతో రేవంత్‌ను టార్గెట్ చేసింది బీఆర్ఎస్. రాహుల్ గాంధీనేమో అదానీని విమర్శిస్తుంటే సీఎం రేవంత్ ఆయనతో దోస్తీ చేస్తున్నారంటూ అటాక్ చేసింది. ఇష్యూ అటు తిరిగి పెద్ద వివాదం అవుతుండటంతో సీఎం రేవంత్ అదానీ విరాళాన్ని తిరస్కరిస్తున్నామంటూ ప్రకటించారు. అయినా రేవంత్‌ను వదిలిపెట్టడం లేదు బీఆర్ఎస్. దావోస్‌లో చేసుకున్న 12వేల 400 కోట్ల విలువ చేసే ఒప్పందాల మాటేమిటని ప్రశ్నిస్తోంది. ఈ నేపథ్యంలో అదానీ వ్యవహారంలో రేవంత్ వర్సెస్ కేటీఆర్ అన్నట్లుగా పొలిటికల్ పిక్చర్ మారిపోయింది.అదానీతో తాను దోస్తీ చేస్తున్నానంటున్న కేటీఆర్..ఆయన అదానీని కలిసిన విషయం మర్చిపోయారంటూ విమర్శించారు సీఎం రేవంత్. అదానీతో అంటకాగింది బీఆర్ఎస్ నేతలేనని..గత సర్కార్ హయాంలో అదానీ సంస్థలకు ఎన్నో ప్రాజెక్టులు ఇచ్చారంటూ చెప్పుకొచ్చారు రేవంత్. నేషనల్ హైవేల నిర్మాణం, డేటా సెంటర్లు, ఇతర సంస్థలు ప్రారంభించడానికి కేటాయించిన భూముల విషయంలో మీ మీద ఏమైనా కేసులు పెట్టాలా అంటూ ప్రశ్నించారు.

కేటీఆర్ సీరియస్‌గా రియాక్ట్

అయితే రేవంత్ విమర్శల మీద కేటీఆర్ సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు. సీఎంలో నిస్పృహ, అసహనం కనిపిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో అదానీకి పనులు ఇచ్చామంటూ తప్పుడు మాటలు చెప్తున్నారని మండిపడ్డారు. సీఎం అవగాహనా రాహిత్యంతో మాట్లాడితే ఎలా అంటూ ప్రశ్నించారు. అదానీ తమను కలిసి కొన్ని ప్రతిపాదనలు ఇస్తే అప్పటి సీఎం కేసీఆర్ తిరస్కరించారని చెప్పారు కేటీఆర్. తాను అదానీని సీక్రెట్‌గా ఏం కలవలేదని..తన ట్విట్టర్ అకౌంట్‌లోనే పెట్టానంటున్నారు కేటీఆర్. అంతేకాదు అదానీకి..తాము రెడ్ సిగ్నల్ వేస్తే.. రేవంత్ రెడ్ కార్పెట్ వేస్తున్నారని విమర్శించారు.అదానీ విరాళం వద్దంటూ రేవంత్ బ్యాక్ స్టెప్ వేయడం తమ విజయమే అంటోంది బీఆర్ఎస్. తాము ఒత్తిడి చేయడం వల్లే..రాహుల్ గాంధీ కాంగ్రెస్ అధిష్టానం రేవంత్‌ను చీవాట్లు పెట్టిందని..అందుకే హడావుడిగా విరాళం వద్దంటూ ప్రకటించారని చెప్తోంది. అంతేకాదు అదానీ దగ్గర చెక్కు తీసుకున్నప్పుడు రేవంత్‌కు అదానీ కథేంటో తెలియదా అని ప్రశ్నిస్తోంది.మరోవైపు బీజేపీ కూడా రేవంత్‌ను టార్గెట్ చేస్తుండటం హాట్ టాపిక్ అవుతోంది. ఎవరికి భయపడి చెక్ వాపస్ చేశారో రేవంత్ రెడ్డి చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఒప్పందం చేసుకున్నప్పుడు రాహుల్ గాంధీకి ఎందుకు భయపడలేదు.? చెక్ వాపస్ ఇవ్వకపోతే రాహుల్ గాంధీ అపాయింట్మెంట్ ఇవ్వనని చెప్పాడా.? అంటూ ఎద్దేవా చేస్తున్నారు కమలం లీడర్లు. అదానీతో దావోస్‌లో చేసుకున్న రూ.12వేల కోట్ల ప్రాజెక్టును కూడా రద్దు చేస్తున్నారా అని నిలదీస్తున్నారు.ఇలా అదానీ వ్యవహారం సీఎం రేవంత్‌కు హెడెక్‌గా మారింది. వంద కోట్ల విరాళం వెనక్కి ఇచ్చే వరకు ఒక లొల్లి ఉంటే..ఇప్పుడు దావోస్ ఒప్పందం మాటేమిటని ప్రెజర్ మొదలైంది. దీంతో అగ్రిమెంట్లు రద్దు చేయడం అంత ఈజీ కాదన్నట్లుగా చెప్తున్నారు సీఎం రేవంత్. దానికి లీగల్‌గా సమస్యలు ఉంటాయని చెప్పుకొస్తున్నారు.

ఒప్పందాల సంగతేంటి అంటూ..

ఈ విషయంలో కూడా రేవంత్‌ను టార్గెట్ చేస్తోంది అపోజిషన్ బీఆర్ఎస్. రేవంత్ రెడ్డి తెలంగాణకు సీఎంగా ఉంటూ అదానీ, అల్లుడు, అన్నదమ్ముళ్ల కోసమే పనిచేస్తున్నారని విమర్శిస్తోంది. కాంగ్రెస్ పార్టీ విధానం ప్రకారమే విరాళం వెనక్కి తీసుకుంటే ఒప్పందాల విషయంలో కూడా అంతే సీరియస్‌గా ఎందుకు రియాక్ట్ కావడం లేదో చెప్పాలంటోంది. ఎవరూ విరాళం తీసుకున్నా చర్యలు తీసుకోవాల్సిందేనంటూ రాహుల్ చేసిన కామెంట్స్‌ను కూడా బీఆర్ఎస్ ప్రస్తావిస్తోంది.అదానీతో దోస్తీ చేస్తూ రేవంత్ దోచుకుంటున్నారని బీఆర్ఎస్ అంటే..కేసీఆర్ హయాంలో అదానీకి పనులు ఇచ్చారంటూ సీఎం ఆరోపిస్తున్నారు. ఆ కామెంట్స్‌కు కేటీఆర్ స్ట్రాంగ్ రిప్లై ఇచ్చారు. అదానీతో భేటీ అయింది వాస్తవమే కానీ..ఆయన ప్రపోజల్‌ను తిరస్కరించామని అంటున్నారు. కేంద్రం ఇచ్చిన ప్రాజెక్టులే తప్ప తాము అదానీకి కట్టబెట్టిందేమి లేదంటోంది బీఆర్ఎస్.వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడి రేవంత్ పరువు తీసుకుంటున్నారని అటాక్ చేశారు కేటీఆర్. ఇలా ఈ ఇద్దరి డైలాగ్‌వార్‌తో ఇంతకీ అదానీతో దోస్తీ చేసిందెవరు.? అనేది హాట్ టాపిక్ అవుతోంది. ఎవరు మాట్లాడిన దాంట్లో వాస్తవాలు ఉన్నాయనేది చర్చనీయాంశంగా మారుతోంది. ఇప్పటికైతే విరాళం వెనక్కి ఇచ్చేసేలా చేసి పైచేయి సాధించామని బీఆర్ఎస్ ఖుషీ అవుతోందట. చూడాలి మరి ఈ వ్యవహారం ఇంకా ఎక్కడికి వరకు వెళ్తుందనేది.

# సీఎం కావాలనేది లోకేష్ కు చిటికెలో పని!



అమరావతి,టీడీపీ యువనేత సీఎం అవుతారా? ఈ అంశం గురించి చర్చకు ఇది సమయం కాకపోవచ్చు. ఎందుకంటే ఎన్నికలు జరిగి ఆరు నెలలు కూడా పూర్తి కాలేదు. అసలు లెక్క ప్రకారం చూస్తే.. వచ్చే ఎన్నికలు 2029 లో జరగాల్సి ఉంది. అప్పటికి ఇంకా చాలా సమయం ఉంది. అయితే డిప్యూటీ సీఎం హోదాలోని పవన్ కల్యాన్ రాబోయే పది సంవత్సరాలూ సీఎంగా చంద్రబాబు నాయుడే ఉండాలని ఆకాంక్షించిన విషయం తెలిసిందే. ఇది ఒక ఆసక్తికర చర్చకు దారి తీసింది. అయితే చంద్రబాబు నాయుడుకు ప్రజలు అయితే కూటమి ద్వారా ఇంకో అవకాశం ఇచ్చారు కాబట్టి, ఇంకో నాలుగున్నరేళు ఆయన అధికారికంగా సీఎంగా కొనసాగవచ్చు. ఆ తర్వాత ఎన్నికలు జరగాల్సి ఉంది. జమిలి ఎన్నికల సంగతులను పక్కన పెడితే, 2029 వరకూ చంద్రబాబు నాయుడు సీఎంగా కొనసాగడానికి అవసరమైన మెజారిటీ అయితే టీడీపీ వద్ద ఉంది. ఒకవేళ ఏదైనా కారణం చేత ఈ కూటమి నుంచి పవన్ కల్యాణ్ బయటకు వచ్చినా, చంద్రబాబు నాయుడు సీటుకు అయితే ఎలాంటి ఇబ్బంది లేదు. ఆ మేరకు టీడీపీకి సొంత మెజారిటీ ఉంది. రాజకీయాల్లో ఎవరి వ్యూహాలు ఏ మేరకు ఎప్పుడు మారతాయో వేరే చెప్పనక్కర్లేదు. స్వయంగా చంద్రబాబు-పవన్ కల్యాణ్ ల స్నేహాన్నే ఇందుకు ఉదాహరించినా 2014 ఎన్నికల్లో వీరంతా కూటమిగా వెళ్లారు. ఆ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ పార్టీ పోటీ చేయలేదు, అయితే జనసేన అంటూ పార్టీ పెట్టి అప్పుడు చంద్రబాబు ను సీఎంగా చేయడానికి పవన్ చాలా కష్టపడ్డారు. అయితే అదే పవన్ కల్యాణ్ మనసు 2019 నాటికి మారిపోయింది. ఎర్ర పార్టీలతో జట్టు కట్టారు..ఫలితం కనిపించలేదు. దాంతో ఎరుపు కన్నా కాషాయమే బెటర్ అనుకుని తిరిగి పవన్ కల్యాణ్ కాషాయ కూటమిలో మళ్లీ చేరారు! ÷ుాబట్టి.. ఎరుపు, కాషాయం ఇలా ఎప్పుడు ఏ రంగులు అయినా మారిపోవచ్చు. కాబట్టి రాబోయే పదేళ్ల రాజకీయం గురించి పవన్ తన ఆకాంక్షను చెప్పేయడం కాస్త విచిత్రమే. అయితే ఇది పవన్ వీరాభిమానులకు మింగుడు పడదు. పవన్ కల్యాణ్ సీఎం కావాలనేది ఆయన వీరాభిమానుల సుదీర్ఘ ఆకాంక్ష. క తెలుగుదేశం చంద్రబాబే సీఎం అభ్యర్థిగా గత ఎన్నికలకు వెళ్లింది. అయితే ఆ పార్టీ యువ కిరణం లోకేష్ సీఎం కావాలని అక్కడా డిమాండ్ ఉంది. ఈ డిమాండు కూడా పాతదే. 2019 ఎన్నికలు పూర్తి కాగానే.. లోకేష్ సీఎం, ప్రధాన మంత్రిగా చంద్రబాబు, రాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు ఉంటారంటూ అప్పట్లో నే ప్రచారాలు మొదలుపెట్టారు. 2019 ఎన్నికల్లో టీడీపీ గెలుస్తుందని, కాంగ్రెస్ తో కలిసిన చంద్రబాబు చక్రం తిప్పి సీఎం అవుతారని దీంతో రెండు పదవుల్లో కొనసాగలేరుకాబట్టి.. లోకేష్ సీఎం అవుతారనేది అప్పుడు జరిగిన ప్రచారం. అయితే ఫలితాలు వేరేలా రావడంతో వారి కలలకు భంగం కలిగింది. ఆ సంగతలా ఉంటే.. ఒకవేళ 2029 నాటికి అయినా లోకేష్ ను టీడీపీ సీఎం క్యాండిడేట్ చేయాలనుకుంటే, లేదా అంతలోపే సీఎం సీట్లో లోకేష్ ను కూర్చోబెట్టేసి ఎన్నికలకు వెళ్లాలని చంద్రబాబు భావిస్తే.. అప్పుడు పవన్ పరిస్థితి ఏమిటనేదే ఆసక్తదాయకమైన అంశం.ఇక, టీడీపీకి చంద్రబాబు తరువాత లోకేషే బాస్. పోటీదారు అనుకున్న జూనియర్ ఎన్టీఆర్ ను ఎప్పుడో సైడ్ చేశారు. కాబట్టి నిజంగా లోకేష్ కోరుకుంటే, ఏ ఆటంకం లేకుండా సీఎం అయిపోగలడు. ఒకవేళ తనకు వయసు మీద పడుతోందనో, లేక లోకేష్ ను ఎన్నికలకు ముందే సీఎంగా కూర్చోబెట్టేయాలనో చంద్రబాబు భావించినా ఆశ్చర్యం లేదు. అలాంటి పరిస్థితి ఇంకో రెండు మూడు సంవత్సరాల తర్వాత వచ్చినా అప్పుడు పవన్ కల్యాణ్ సమ్మతించక తప్పుతుందా అనేది ఆసక్తిదాయకమైన అంశం. అసలు పవన్ సమ్మతితో టీడీపీకి పని లేకపోవచ్చు. ఎందుకంటే పోటీ చేసింది కూటమిగానే కానీ, టీడీపీకి సొంత బలం ఉంది. సొంతంగా మెజారిటీకి కావాల్సినంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారు. పార్టీ గీత దాటని వారే వారిలో ఎక్కువమంది. లోకేష్ సీఎం అంటే.. వారిలో చాలా మంది ఎగిరిగంతేస్తారు. కాబట్టి సీఎం కావాలనేది లోకేష్ కు చిటికెలో పని!

# ఢిల్లీలో జనసేనాని బిజీబిజీ..



న్యూఢిల్లీ, జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఢిల్లీలో బిజీబిజీగాగా ఉన్నారు. పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. పిఠాపురంలో ఆర్వోబీ, రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని విజ్ఞప్తి చేవారు. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు రుణం గడువును 2026వరకు పొడిగించాలని కోరారు. పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో సామర్లకోట ఉప్పాడ రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అవసరం ఉందని, సత్వరమే ఈ ఆర్వోబీని మంజూరు చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రికి పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు. పలు రైల్వే ప్రాజెక్టులు, ప్రజల అవసరాల గురించి చర్చించారు. 'పిఠాపురం పట్టణ పరిధిలోని V-V ™సక్షన్‌లో, సామర్లకోట-ఉప్పాడ రోడ్డులో రైల్వే కి.మీ 640/30-32 వద్ద లెవెల్ క్రాసింగ్ నంబర్ 431కి బదులుగా ఆర్ఓబీ అవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. నిరంతరంగా ఉండే ట్రాఫిక్ రద్దీని పరిష్కరించడానికి, ఆ ప్రాంతంలో రోడ్ కనెక్టివిటీని మెరుగుపరచడానికి ఈ మౌలిక సదుపాయాల కల్పన చాలా అవసరం. ఈ ప్రాజెక్టును ప్రధానమంత్రి 'గతి శక్తి' కార్యక్రమం ద్వారా మంజూరు చేయాల'ని కోరారు. అదే విధంగా పిఠాపురంలోని శ్రీపాద వల్లభ స్వామి దేవాలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం నాలుగు ముఖ్యమైన రైళ్ళకు పిఠాపురం రైల్వే స్టేషన్లో హాల్ట్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నాందేడ్ - సంబల్పూర్ నాగావళి ఎక్స్ ప్రెస్, నాందేడ్ - విశాఖపట్నం సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్, విశాఖపట్నం-సాయి నగర్ షిర్డీ ఎక్స్ ప్రెస్, ఏపీ ఎక్స్ ప్రెస్ (విశాఖపట్నం - న్యూఢిల్లీ)కి పిఠాపురంలో హాల్ట్ అవసరమని తెలిపారు.మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం సందర్భంగా లాతూరు ప్రజలు చేసిన విన్నపాన్ని రైల్వే శాఖ మంత్రి ముందు ఉంచారు. లాతూరు నుంచి తిరుపతికి రైలు ఏర్పాటు చేయాలని కోరిన విషయాన్ని తెలుపుతూ ఈ ప్రతిపాదనపై పరిశీలన చేయాలని కోరారు.ఢిల్లీ పర్యటనలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పవన్ సమావేశమయ్యారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధికి ఏఐఐబీ రుణంలో వెసులుబాట్లు కోరారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రోడ్ల ప్రాజెక్ట్ (ఏపీఆర్ఆర్‌పీ) కోసం ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ & ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) నుంచి తీసుకొన్న రుణానికి సంబంధించి ప్రాజెక్టును 31 డిసెంబర్ 2026 వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ గ్రామీణ రహదారి ప్రాజెక్ట్‌లో మార్పుల కోసం విన్నవించారు. ప్రాజెక్టు పూర్తి చేసేందుకు 31 డిసెంబర్, 2024 వరకు ఇచ్చిన ప్రస్తుత గడువు సరిపోదని రుణ ఒప్పందంలో పేర్కొన్న ప్రకారం రీయింబర్స్‌మెంట్ పద్ధతిలో కాకుండా ముందస్తు చెల్లింపు పద్ధతిలో కొనసాగించాలని కోరారు.

డిసెంబర్ 2026 వరకు ప్రాజెక్ట్ పొడిగింపు ఇవ్వాలని కోరారు. నిధుల చెల్లింపుల విధానంలో మార్పులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న 70% (AIIB) :30 %ం పన్నులు (AP ప్రభుత్వం) విధానం నుంచి 90% (AIIదీ) :10% (AP ప్రభుత్వం) మార్పు చేసి.. 455 మిలియన్ US డాలర్ల (అంటే రూ. 3834.52 కోట్లు) బ్యాంక్ ఒప్పుకొన్న మేరకు వాటాను కొనసాగిస్తూ నిధుల విడుదలను మార్పును పరిగణనలోకి తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. జల జీవన్ మిషన్ (జె.జె.ఎం.) యొక్క నిజమైన స్ఫూర్తిని సాధించాలంటే... బోరు బావులపై ఎక్కువగా ఆధారపడకుండా.. దీర్ఘకాలిక, నిలకడతో ఉన్న వనరుల నుంచి నీటిని సేకరించడం చాలా కీలకం. ఆ దిశగా ఆంధ్ర ప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్. శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ కేంద్ర మంత్రికి వివరించారు.ఢిల్లీలో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జె.జె.ఎం. అమలుపై చర్చించారు. '2019-2024 మధ్య అందించిన కనెక్షన్లలో కుళాయిల సామర్థ్యం, నీటి నాణ్యత అంశంలో ఇటీవల చేసిన సర్వే ద్వారా పలు సమస్యలను గుర్తించామ'ని కేంద్ర మంత్రికి తెలిపారు. సర్వే ఫలితాల ప్రకారం 29.79 లక్షల కుటుంబాలకు ట్యాప్ కనెక్షన్లు అందలేదనీ, అలాగే 2.27 లక్షల పంపులు పని చేయడం లేదని. మరో 0.24 లక్షల ట్యాపులు అవసరమైన స్థాయిలో నీటిని సరపరాచేయడం లేదని వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నీటి సరఫరా, తగినంత మేర సరఫరా (ప్రతి వ్యక్తికి రోజుకి 55 లీటర్లు), నాణ్యమైన నీటిని అందించాలన్న లక్ష్యాలను ఇంకా సాధించలేదని సర్వే ద్వారా తేలిందని చెప్పారు.రాష్ట్రానికి మకుటాయమానంగా నిలిచే పర్యటక ప్రాజెక్టులకు కేంద్రం తగిన విధంగా సహకరించి, వాటి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పవన్ కళ్యాణ్ కేంద్ర పర్యటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కోరారు.

# అది ఏఆర్ డెయిరీ నెయ్యి కాదు.. సిట్ విచారణలో సంచలన విషయాలు!

తిరుమల: శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యిని సరఫరా చేసేందుకు టీటీడీతో ఏఆర్ డెయిరీ ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఒప్పందానికి విరుద్ధంగా వైష్ణవి డెయిరీ నుంచి నెయ్యి సేకరించి.. తన ట్యాంకర్ల ద్వారా టీటీడీకి సరఫరా చేసినట్టు సిట్ నిర్ధారణకు వచ్చింది. తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందా అనే అంశంపై సిట్ దర్యాప్తును వేగవంతం చేసింది. లడ్డూ ఎక్కడ నుంచి వచ్చింది?, ఎక్కడ తాయారు అయింది?, లడ్డూ ఏ నెయ్యి వాడారు?, ఆవు నెయ్యా? లేదా బర్రె నెయ్యా?, కల్తీ జరిగి ఉంటే ఎక్కడ జరిగింది?, ఎవరి అండతో కల్తీ చేశారు?, అధికారులకు తెలిసిన సైలెంట్ గా ఉన్నారా? ఇలా అనేక కోణాల్లో సిట్ అధికారులు విచారణ జరుపుతున్నారు. కాగా ఈ కేసు విచారణలో సిట్ అధికారులు సంచలన విషయాలను బయటపెట్టారు.

అది ఏఆర్ డెయిరీ నెయ్యి కాదు...

నిన్న సుప్రీం కోర్టు నియమించిన సిట్ అధికారులు సీబీఐ డైరెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. కల్తీ నెయ్యి కేసు విచారణలో తాము సేకరించిన సమాచారాన్ని సీబీఐ డైరెక్టర్ కు వివరించారు. అసలు ఈ నెయ్యి ఏఆర్ డెయిరీ తాయారు చేసింది కాదని సంచలన విషయాన్ని బయటపెట్టారు. వాస్తవానికి లడ్డూ తాయారు చేసేందుకు అవసరమైన నెయ్యిని సరఫరా చేస్తామని టీటీడీతో ఏఆర్ డెయిరీ సంస్థ ఒప్పందం కుదుర్చుకుందని.. కానీ ఒప్పందాలను పక్కకు ఏఆర్ డెయిరీ నిర్వాహకులు వైష్ణవి డెయిరీ నుంచి నెయ్యి సేకరించి.. తన ట్యాంకర్ల ద్వారా టీటీడీకి సరఫరా చేసినట్టు సిట్ అధికారుల విచారణలో తేలింది.

పక్క ఆధారాలతో...



కాగా ఈ ఏడాది మొదట్లో టీటీడీతో ఏఆర్ డెయిరీ ఒప్పందం చేసుకుంది. ఏఆర్ డెయిరీ సంస్థ తమిళనాడుకు చెందినది. అయితే ఒప్పందానికి విరుద్ధంగా ఏఆర్ డెయిరీ వ్యవహరించింది. తమ లారీలను వైష్ణవి డెయిరీకి పంపి అక్కడి నుంచి నెయ్యిని తీసుకొని..టీటీడీకి సరఫరా చేసినట్లు ఆధారాలను సిట్ అధికారులు సేకరించారు. లారీ వెళ్లే మార్గాలు, టోల్ గెట్ వద్ద ఆగిన సమయాలు ఇలా అన్ని ఆధారాలను సిట్ అధికులు పక్కాగా సేకరించినట్టు తెలుస్తోంది. కాగా ఈ కేసు విచారణ ఇప్పటికే కొలిక్కి వచ్చినట్లు సమాచారం.త్వరలోనే ఈ కేసును సిట్ అధికారులు ఛేదించి అసలు విషయాలను బయటపెట్టనున్నట్లు తెలుస్తోంది.

# రెండో దశ మెట్రో ప్రాజెక్టుల డీపీఆర్ రెడీ !



హైదరాబాద్,విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరానికి తోడుగా నిలుస్తూ.. మెట్రో రైలు రెండో దశ పనులకు రేవంత్ సర్కారు త్వరలోనే శ్రీకారం చుట్టనుంది. ఇందుకు సంబంధించి ఆరు కారిడార్లుగా పనులను విభజించగా.. ఐదు కారిడార్లకు డీపీఆర్‌లు సిద్ధమయ్యాయని మెట్రోరైలు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో మెట్రో రైలు ప్రాజెక్ట్ విస్తరణ దిశగా అడుగులు పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే, మూడవ అతి పెద్ద మెట్రో నెట్వర్క్‌గా హైదరాబాద్ మెట్రో నెట్వర్క్ అవతరిస్తుందని వెల్లడించారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో హైదరాబాద్ మెట్రో రైలు విజయవంతంగా నడుస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ 69 కిలోమీటర్ల మేర అందుబాటులో ఉండి ప్రపంచంలోనే ఏడేళ్ళు పూర్తి చేసుకున్న అతి పెద్ద మెట్రో రైలు ప్రాజెక్ట్‌గా అరుదైన ప్రతిష్టను సంపాదించుకుందని చెటప్పారు.ముంబై, చెన్నైలో లక్షల కోట్లు ఖర్చు చేసి మెట్రో రైల్ ప్రాజెక్టును విస్తరిస్తున్నారని దురదృష్టవశాత్తు మన నగరంలో విస్తరణ లేని కారణంగానే మూడవ స్థానంలో ఉన్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో మెట్రో రైల్ రెండోదశ ప్రాజెక్టు విస్తరణపై సుదీర్ఘంగా చర్చించామని పేర్కొన్నారు.రెండో దశ ప్రాజెక్ట్‌కు ప్రభుత్వం అత్యంత ప్రధాన్యత ఇస్తోందని చెప్పారు. మొత్తం 57 స్టేషన్లతో ప్రపంచంలోనే పీపీపీ మోడ్‌లో అతిపెద్ద నెట్‌వర్క్‌తో రూ.22 వేల కోట్లతో అందుబాటులో ఉందన్నారు. హైదరాబాద్ మెట్రో మూడు కారిడార్లు విమానాశ్రయానికి కలిసేలా రెండో దశ ప్రాజెక్టులో ఐదు కారిడార్లకు డీపీఆర్ లు సిద్ధం చేసి పంపామని ఆయన అన్నారు.మొత్తం రెండో దశలో 116.4 కిలోమీటర్ల పైగా మార్గాన్ని చేపట్టనున్నట్లు ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నియమం ప్రకారం 90 శాతం రైట్ ఆఫ్ వే ఉండాలన్న నియమం మేరకు అమలయ్యేలా ప్రాజెక్టు అనుమతులకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు.

## యాదగిరిగుట్టలో డ్రగ్స్ కలకలం

యాదగిరిగుట్ట, డ్రగ్స్ మహమ్మారి ఇప్పుడు యాదగిరిగుట్టను కూడా తాకింది. ఎవ్వరూ ఊహించని విధంగా యాదగిరిగుట్ట మండలం రామాజీపేట యాదాద్రి లైఫ్ సైన్సెస్ కెమికల్ ఫ్యాక్టరీలో భారీగా డ్రగ్స్ తయారు చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. పోలీసుల అదుపులో ఆరుగురు నిందితుల ఉన్నట్లు సమాచారం.యాదగిరిగుట్ట నుండి హైదరాబాద్ తరలిస్తుండగా భువనగిరి మండలం గూడూరు టోల్ గేట్ వద్ద పోలీసులకు పట్టుబడ్డ డ్రగ్స్ ముఠా సభ్యులు. గతకొంత కాలంగా గుట్టు చప్పుడు కాకుండా ఎపిడ్రిన్ అనే డ్రగ్ తయారీ చేస్తున్నట్లు సమాచారం.యాదగిరిగుట్ట కేంద్రంగా తయారు చేస్తున్న ఈ డ్రగ్ నీ హైదరాబాద్, ముంబై తరలిస్తున్నట్లు తెలుస్తోంది. నిన్నటి నుండి యాదాద్రి భువనగిరి డిసిపి ఆధ్వర్యంలో సోదాలు కొనసాగుతున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడుగా ఉన్న ప్రభాకర్ రావుపై మరోకేసు..!

హైదరాబాద్, ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడుగా ఉన్న SIB మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుపై మరో కేసు నమోదు అయ్యింది. రూ. 50 కోట్ల విలువైన తమ పట్టా భూమిని కొందరు అధికారులు అక్రమంగా కొనుగోలు చేశారని బీర్ల మల్లేష్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 180లో ఈ భూములు ఉన్నట్లు బాధితుడు చెబుతున్నాడు. కేసులో ప్రభాకర్‌రావుతోపాటు మాజీ సీఎస్ సోమేష్‌కుమార్ సహా పలువురు బ్యూరోకాట్ల పేర్లు ఉన్నట్లు సమాచారం. తమ భూములపై పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన సురేష్ ముదిరాజ్ అనే వ్యక్తి ఆ భూములను ప్రభాకరరావు సహా పలువురు ఐపీఎస్ అధికారుల కుటుంబాలకు విక్రయించినట్లు ఆరోపించారు. IAS, IPS, రెవెన్యూ ఉన్నతాధికారులతో సహా ప్రభుత్వ సీనియర్ అధికారులు ఈ మోసానికి పాల్పడ్డారని కంప్లైంట్‌లో పేర్కొన్నారు. నిజానికి ఆ భూములపై తామే హక్కు దారులమని, భూ రికార్డులను తారుమారు చేసి మోసం చేశారంటూ బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ప్రభాకర్ రావుపై ఈడీ కేసు నమోదు చేసింది. ఇదిలా ఉంటే రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు ఏ1 నిందితుడుగా ఉన్నారు.ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చిన తరవాత ప్రభాకర్ రావు అమెరికా వెళిపోయారు. ఆయనను అధికారులు అమెరికా నుండి రప్పించే



ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. మరోవైపు ఇటీవలే ఆయనకు అమెరికాలో గ్రీన్ కార్డ్ మంజూరైనట్టు వార్తలు వచ్చాయి. అమెరికాలో స్థిరపడిన కుటుంబ సభ్యుల స్పాన్సర్ షిప్ తో ఆయనకు గ్రీన్ కార్డ్ మంజూరైనట్టు ప్రచారం జరిగింది. దీంతో విచారణపై ఇది ప్రభావితం చూపే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఎలాగైనా ఆయనను ఇండియాకు రప్పించి విచారణ వేగవంతం చేసే ఆలోచనలో ఉన్నారు. ఈ క్రమంలో ఆయనపై ఈడీ కేసు కూడా నమోదు అవ్వడం ఆసక్తికరంగా మారింది. దీంతో ముందు ముందు ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయన్నది హాట్ టాపిక్ గా మారింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com